


విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 18-10-2022 సంపుటి : 04 సంచిక : 52 పేజీలు : 4 వెల : రూ 3-00




# బాబు, కరువు రెండూ కవల పిల్లలు: సీఎం జగన్



నంద్యాల : రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని.. ఆళ్లగడ్డ నుంచి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ పథకం రెండో విడత సాయం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి అడుగులోనూ రైతులకు మంచి చేస్తున్నామని, ప్రతి అంశంలో అండగా ఉంటున్నామన్నారు.”దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు తోడుగా ఉంటున్నాం. క్రమం తప్పకుండా ప్రతి పథకాన్ని అమలు చేస్తున్నాం. క్యాలెండర్ ప్రకారం ప్రతి కుటుంటానికి అండగా ఉంటున్నాం. రాష్ట్రంలో 68 శాతం మంది రైతులకు 1.25 ఎకరాల లోపు భూమి ఉంది. 82 శాతం మంది రైతులకు 2.5 ఎకరాల లోపు భూమి ఉంది. రూ.13,500 సాయం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేసి అండగా ఉంటున్నాం. ఎక్కడా లంచాలు లేవు, వివక్ష లేదు” అని సీఎం జగన్ అన్నారు.ఇప్పటికే మేలో రూ.7,500 ఇచ్చాం. ఇప్పుడు రూ. 4వేలు ఇస్తున్నాం. మూడున్నరేళ్లలో రైతు భరోసా కింద రూ. 25,971 కోట్ల మేర లబ్ధి కలిగింది. మొత్తం 50 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బు జమ చేశాం. ఒక్కో కుటుంబానికి ఇప్పటివరకు రూ.51 వేలు అందించాం. పట్టాలు ఉన్న రైతులకే కాకుండా కౌలు రైతులకు, దేవాదాయ భూములు సాగుచేసుకుంటున్న రైతులకు సాయం అందించాం. మూడున్నరేళ్లలో కేవలం రైతన్నల కోసం రూ.1.33 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఒక మండలాన్ని కూడా కరవు మండలంగా ప్రకటించాల్సిన అవసరం రాలేదు. చంద్రబాబు హయాంలో ఏటా కరువే. బాబు, కరువు రెండూ కవల పిల్లల అన్నట్లు పాలన సాగింది” అని సీఎం జగన్ పేర్కొన్నారు.”అక్టోబర్ 12 వరకు సాధారణం కంటే 4 శాతం అధిక వర్షపాతం నమోదైంది. దేవుడి దయతో రాష్ట్రంలో మంచి వర్షాలు కురుస్తున్నాయి. గతంలో సగటున 1.54 లక్షల టన్నుల ఉత్పత్తి అయితే.. ఇప్పుడు ఆహార ధాన్యాల ఉత్పత్తి సగటున 167. 24 లక్షల టన్నులకు చేరింది. భూగర్భ జలాలు రికార్డు స్థాయిలో పెరిగాయి. రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు మోసం చేశారు. ఈ ప్రభుత్వంలో రైతులు కోలుకుని మళ్లీ రుణాలు తీసుకుంటున్నారు” అని సీఎం అన్నారు.



# సింగిల్ బ్రాండ్ భారత్‌తో అన్ని సబ్సిడి ఎరువులు: మోదీ కొత్త స్కీం



న్యూఢిల్లీ: కేంద్రం ప్రధాన మంత్రి భారతీయ జన్ ఉర్వరక్ పరియోజన కింద ‘వన్ నేషన్ వన్ ఫెర్టిలైజర్’ అనే కొత్త పథకాన్ని ప్రారంభించింది.ఈ పథకం కింద అన్ని సబ్సిడీ ఎరువులను ఒకే బ్రాండ్ కింద మార్కెట్ చేయడం తప్పనసరి చేశారు. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీ పీఎం కిసాన్ సమ్మేళన్ 2022 సందర్భంగా జరుగుతున్న రెండు రోజుల కార్యక్రమంలో సింగిల్ బ్రాండ్ భారత్ పేరుతో ఈ కొత్త పథకాన్ని ప్రారంభించారు.సబ్సిడి ఎరువుల అక్రమ మార్గంలో తరలింపుకు చెక్‌పెట్టేలా ఈ పథకాన్ని తీసుకువచ్చారు. ఈ పథకం కింద యూరియా, డి అమ్మోనియా ఫాస్ఫేట్(డీఏపీ), మ్యూరియేట్ ఆఫ్ పొటాష్(ఎంఓపీ), ఎన్‌పీకే వంటివి ఒకే బ్రాంక్ కింద విక్రయాలు జరుగుతాయి. అంతేగాక సుమారు 600 పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాలను(పీఎంకేఎస్‌కే) కూడా ప్రారంభించారు. ఇవి రైతులకు వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులు అందిచడమే కాకుండా బహుళ సేవలను అందించే ఒక షావుగా పనిచేస్తుంది.దేశంలో దాదాపు 3.5 లక్షలకు పైగా ఉన్న రిటైల్ దుకాణాలను పీఎంకేఎస్‌కేగా మార్చాలని కేంద్రం భావిస్తోంది. ఈ కేంద్రల్లో విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు వంటివి అందించడమే కాకుండా, మట్టి, విత్తనాలు, ఎరువులకు సంబంధించిన పరీక్ష సౌకర్యాన్ని కూడా అందిస్తుంది. అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా అందిస్తుంది.మోదీ ఈ రెండు రోజుల కిసాన్ సమ్మేళన్ కార్యక్రమ ంలో “ఇండియన్ ఎడ్జ్” అనే ఈ మ్యాగజైన్ కూడా ప్రారంభించారు. దీనిలో దేశీయ, అంతర్జాతీయ ఎరువుల సమాచారం, ఇటీవల ఉన్న ధరలు, అభివృద్ధి, వినియో గాలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారం అందిస్తుంది. ఈ కార్యక్రమ ంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, రసాయ నాలు, ఎరువుల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా తదితరులు పాల్గొన్నారు.

# మూడు కాకపోతే ముప్పయ్ పెళ్లిళ్లు చేసుకో.. పవన్‌పై పేర్ని నాని స్ట్రాంగ్ కామెంట్స్

కృష్ణా జిల్లా: పవన్ కల్యాణ్ రాజకీయ నాయకుడా? లేక ఫ్యాక్షన్ ముఠా నడుపుతున్నారా? అంటూ మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు.సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, షూటింగ్ గ్యాప్‌లో పవన్ విశాఖకు వెళ్లారు. విశాఖ నుంచి కదలనని ఎందుకు వెళ్లిపోయారు. పవన్‌కు చంద్రబాబు ప్రయోజనాలే కావాలి. విలువలు, నిబద్ధత లేని వ్యక్తి పవన్ కల్యాణ్ అని పేర్ని నాని దుయ్యబట్టారు.”మీ కార్యక్రమాన్ని మేం ఆపలేదు, టీవీల నిండా, పేపర్ల నిండా వార్తలు కావాలి. మళ్లీ రేపటి నుండి షూటింగ్‌లకు వెళ్లిపోవాలి. పవన్‌కు 3 రోజులు షూటింగ్‌లో ఖాళీ దొరికింది” అని ఆయన ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ ఒకే మాట మీద నిలబడడు. చంద్రబాబుకు ఒక శాపం ఉంది. ఆయన నోట నిజం వస్తే ఆయన తల వెయ్యి ముక్కలవుతుందని.. అలాగే పవన్ కల్యాణ్‌కు మాట మీద నిలబడితే అదే శాపం ఇతనికి ఉందేమో” అంటూ పేర్ని నాని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.”మీరు మూడు పెళ్లిళ్లు చేసుకోండి అంటున్నావు. నువ్వు చెడిపోయావ్ కాబట్టి అందరూ చెడిపోవాలని కోరుకుంటున్నావ్. మూడు కాకపోతే ముప్పయ్ పెళ్లిళ్లు చేసుకో భరణం ఇస్తున్నావ్.. కాకపోతే నీతి సూక్తులు చెప్పేటప్పుడు ఇలాంటి తప్పులు చేయకూడదని పవన్‌ను ఉద్దేశించి పేర్ని నాని హితవు పలికారు. ఇప్పటికైనా నిబద్ధతతో, నీతితో కూడిన రాజకీయాలు చేస్తే శత్రువులు కూడా హర్షిస్తారు. మీ కార్యకర్తలే సిగ్గుపడే విధంగా ఎప్పుడు ఎవరి మాట భుజాన్న వేసుకుంటాడో, ఎవరిని నెత్తిన పెట్టుకుంటాడో తెలియని పరిస్థితి. రాజకీయాల్లో విలువలు, నిబద్ధత లేని వ్యక్తిగా పవన్‌కు గుర్తింపు వచ్చింది” అని పేర్ని నాని అన్నారు.

# ఏపీకి అమరావతి మాత్రమే ఏకైక రాజధాని: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



న్యూ ఢిల్లీ అక్టోబర్ 17 ఆంధ్రప్రదేశ్ రాజధాని వ్యవహారంపై కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీకి అమరావతి మాత్రమే ఏకైక రాజధానిగా ఉంటుందని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా నిర్ణయం తీసుకుందన్నారు. అమరావతే ఏపీ రాజధాని ప్రధాని మోడీ చెప్పారన్నారు. అమరావతికే బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఎవరు ఏం చెప్పినా ఏం చేసినా ఏపీ రాజధాని మారే ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టారు.ఏలూరు గుంటూరు జిల్లాల్లో పర్యటన కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమానంలో హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. ఆయనకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు సోము వీర్రాజు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి విశాఖపట్నంలో జనసేన నాయకులను కార్యకర్తలను అరెస్ట్ వ్యవహారంపై స్పందించారు. రాజకీయాల్లో ఎక్కడైనా కక్ష సాధింపు చర్యలు అనేది సరి కాదన్నారు. రాజకీయ పార్టీలు తమ తమ కార్యక్రమాలు చేసుకోవా లని... అంతే కానీ కక్ష సాధింపు చర్యలు ఉండకూడదని హితవు పలికారు. భారతీయ జనతా పార్టీ మొదటి నుంచి అదే చెబుతోందని తెలిపారు. అమరావతిలో సంవత్సరం నుండి ధర్నా చేసిన రైతులకు న్యాయం చేశామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అటు ఇతర రాజకీయ పార్టీ కార్యక్రమం చేస్తున్నప్పుడు అధికార పార్టీ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకునే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉంటుందని హాట్ కామెంట్స్ చేశారు.ఈ సందర్భంగా మహా త్మా గాంధీ స్ఫూర్తితో ప్రధాని మోదీ వ్యవసా య రంగంపై దృష్టి పెట్టారని చెప్పారు. వ్యవసాయదారులకు తక్కువ ధరకే ఎరువులు విత్తనాలు అందించే ప్రయత్నం చేస్తున్నారని ప్రశంసించారు. రైతులు మూస పద్ధతిలో వేసిన పంట మళ్లీ మళ్లీ వేయడ ంతో గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో పంట మార్చి వేస్తే మరింత లాభాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. కరోనా సమయంలోనూ రైతులు ఇంట్లో కూర్చో కుండా పంట పండించారని.. అందరికంటే రైతులు మిన్న అని కిషన్‌రెడ్డి కొనియాడారు. దేశంలో ఎక్కడ ఎరువుల కొరత లేకుండా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు.

# మంత్రి సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్యల పై స్పందించిన కార్పొరేటర్

రంగారెడ్డి ఆదివారం సరూర్ నగర్ డివిజన్ లోని భగత్ సింగ్ నగర్ లో బిజెపి కి సంబంధించిన కార్యకర్తలు టిఆర్ఎస్ పార్టీ లో చేరిన సందర్భంగా మంత్రి సబిత సరూర్ నగర్ బిజెపి కార్పొరేటర్ పై చేసిన వ్యాఖ్యల పై ఆకుల శ్రీవాణి స్పందించారు. సరూర్ నగర్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సబిత ఇంద్రారెడ్డి విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత విద్యా వ్యవస్థ కుప్పకూలి పోయిందని కార్పొరేటర్ అన్నారు. పార్టీ మరి మంత్రి పదవి తీసుకుని కల్వకుట్ల కుటుంబానికి భజన తీయడం తప్ప నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం లేదని అని అన్నారు. రాబోయే ఎలక్షన్ లో మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎక్కడి నుంచి పోటీ చేస్తున్నారో చెప్పాలని కార్పొరేటర్ ప్రశ్నించారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం ఈ ఎనిమిది సంవత్సరాలలో ఏం చేసిందో చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని కార్పొరేటర్ అన్నారు. సరూర్ నగర్ డివిజన్ లో ఉన్న సమస్యల పై మంత్రి ని కలడానికి సిద్ధంగా ఉన్నానని వెంటనే కోటి రూపాయలు మంజూరు చేయించి సమస్యలను పరిష్కరిస్తారా అని ప్రశ్నించారు.

# చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్నా: సోనియా గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం ఇవాళ జరిగిన ఎన్నికలో ఆ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ఓటేశారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఆమె ఓటేశారు. ఆ తర్వాత మీడియా వేసిన ప్రశ్నకు బదులిస్తూ.. ఈ సందర్భం కోసం చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్నట్లు సోనియా వెల్లడించారు. సోనియాతో పాటు పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ కూడా ఇవాళ ఏఐసీసీ ఆఫీసులోనే ఓటేశారు. అధ్యక్ష ఎన్నికల్లో ఖర్గే, థరూర్ మధ్య పోటీ సాగుతున్న విషయం తెలిసిందే.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా సోనియా అతి సుదీర్ఘకాలం చేశారు. 1998 నుంచి 2017 వరకు ఆమె కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ చేశారు. ఆ తర్వాత 2019 నుంచి ఇప్పటి వరకు ఆమే ఆ పదవిలో కొనసాగుతున్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన వారు .. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కానున్నారు.అధ్యక్ష పోరు స్నేహపూర్వకంగా సాగుతున్నట్లు శశిథరూర్ తెలిపారు. కానీ చాలా టఫ్‌గా పోటీ నడుస్తున్నట్లు ఆయన తెలిపారు. సంస్థాగత ఎన్నికల్లో ఏ వ్యక్తి కూడా ఈజీగా గెలవలేరన్నారు. తిరువనంతపురంలో ఉన్న ఇందిరా భవన్‌లోని కేరళ కాంగ్రెస్ కమిటీ ఆఫీసులో థరూర్ ఓటేశారు.




# మునుగోడు ఉప ఎన్నిక బరిలో 47 మంది అభ్యర్థులు




నల్లగొండ : మునుగోడు ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటితో ముగిసింది. ఈ ఉప ఎన్నికకు మొత్తం 130 మంది అభ్యర్థులు 190 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 47 మంది నామినేషన్లు తిరస్కరించబడ్డాయి. మిగిలిన 83 మందిలో 36 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మొత్తంగా ఉప ఎన్నిక బరిలో 47 మంది ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.అయితే మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చొరవతో మునుగోడు ఉప ఎన్నిక బరిలో నిలిచిన 13 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. నిన్న పది మంది, ఇవాళ ముగ్గురు నామినేషన్లను ఉపసంహరించుకుని టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి మద్దతు ప్రకటించారు.మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ తరపున కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బీజేపీ తరపున కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి పాల్వాయి స్రవంతి రెడ్డి బరిలో ఉన్నారు. ఈ ముగ్గురి మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

## 'విశాఖ గర్జన సూపర్ సక్సెస్.. చంద్రబాబు వెన్నులో వణుకు'

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు:చంద్రబాబు పాలనలో పోలీసులను హీనంగా చూశారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు.సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించిన వ్యక్తి చంద్రబాబు అంటూ దుయ్యబట్టారు.ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ పాలనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అరాచక పాలన గురించి ప్రతి ఒక్కరికి తెలుసు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ కల్యాణ్ నడుస్తున్నారని ధ్వజమెత్తారు. విశాఖ గర్జన సూపర్ సక్సెస్ కావడంతో చంద్రబాబు వెన్నులో వణుకు పుడుతుంది.

# సంపాదకీయం

మంగళవారం 18-10-2022

## మళ్లీ ఈసీ కొరడా ఝుళిపించాల్సిందే

ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడమే ప్రజాస్వామ్యానికి మూలం. ఎన్నికల సంఘం ఏర్పడిన తొలి రోజులలో ఇది కనిపించినా, ఇప్పుడా పరిస్థితి లేదు. రాజకీయ పార్టీలు విచ్చలవిడిగా అవినీతికీ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నా ఎన్నికల సంఘం స్పందించడం లేదు. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అది నామమాత్ర పాత్ర పోషిస్తున్నదని అర్థమవుతున్నది. సాధారణ ఎన్నికల నుంచి స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఇదే పరిస్థితి ఉంది. షెడ్యూల్ ప్రకటించి ఎన్నికలను నిర్వహించడమే తన బాధ్యత అనుకుని ఈసీ చేతులు దులుపుకొంటున్నది. రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకొని అవినీతి, ఆశ్రిత పక్షపాతం, మద్యం, డబ్బు పంపిణీ, అధికార దుర్వినియోగానికి ఎలాంటి తావు లేకుండా కనీసం ఒక్క ఎన్నికను కూడా నిబద్ధతతో పూర్తి చేయలేకపోతున్నది. ఇందుకు కారణాలను అన్వేషించకపోతే భవిష్యత్తులో గుండాలు, రౌడీలు మాత్రమే రాజ్యమేలే దుస్థితి వచ్చే ప్రమాదం ఉన్నది. ఇది ఒక్కరికి సంబంధించిన అంశం కాదు, ప్రజలు బుద్ధిజీవులు, విభిన్న వర్గాల వారు, పాలకులు, రాజకీయ పార్టీలు కూడా ఆలోచించవలసిన విషయం. రాజకీయ పార్టీలను బెదిరించి టికెట్ తీసుకుని పోటీ చేసి, అక్రమ పద్ధతులలో గెలవడం వంటి పరిస్థితి వచ్చిననాడు రాజకీయ పార్టీలకు కూడా ఉనికి లేకుండా పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఎన్నికైన ప్రజాప్రతినిధులలో 83 శాతం నేరస్థులే. 'తాడే పాము అయినట్లు-ఏకు మేకు అయినట్లు' రాజకీయ పార్టీలు నేర సామ్రాజ్యాలను విస్తరించకముందే కళ్లెం వేసి కట్టడి చేయాలి. ఇప్పటికే రాజకీయ పార్టీల అవినీతి ఎక్కువైంది. వారిని ఆపేందుకు ఎన్నికల సంఘానికి శక్తి సరిపోవడం లేదేమోనని విశ్లేషకులు భావిస్తున్నారు. కుటుంబ పెద్ద తప్పు చేస్తే ఆ ప్రభావం కుటుంబం మొత్తం మీద పడినట్లు ఎన్నికల సంఘం తప్పు చేస్తే ఆ ప్రభావం ప్రజల మీద పడుతుంది. లోపాలు జరగకుండా ఎన్నికలను నిర్వహించడం ఎంత ముఖ్యమో, అవినీతికి తావు లేకుండా చూడటం అంతే ముఖ్యం. డబ్బు ప్రభావం ఎన్నికలలో ఎంతున్నా ఎన్నికల సంఘం కనీసం స్పందించడం లేదు. ఎంతో విస్తృతాధికారాలు ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలను శిక్షించడంలో అది ఎందుకు వెనకడుగు వేస్తున్నది? ఇది బాధ్యతారాహిత్యం కాదా? ఎన్నికల సంఘం పోకడల వలన అంతిమంగా నష్టపోయేది ప్రజలే. కంచే చేను మేస్తే ఆ పంటను రక్షించే వారు ఎవరు? ఇంటిని కాపాడే పెద్దగా ఉండాల్సిన కేంద్ర ప్రభుత్వం తన పార్టీ గెలుపు కోసం కుట్రలు పన్ని ప్రయోజనాలకు ప్రలోభాలకు పాల్పడి అవినీతి కుట్రలకు పాల్పడితే ఈ దేశాన్ని రక్షించే వారు ఎవరు? నైతిక బాధ్యత వహించేది ఎవరు? ఎన్నికల సంఘం నిర్వీర్యం కావడానికి కారణం ప్రభుత్వాలే. ప్రజలు తమకు నచ్చిన ప్రతినిధిని ఎన్నుకునే వాతావరణం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. చైతన్యవంతమైన యువత, బాధ్యత కలిగిన ప్రజానీకం, విద్యావంతులు, మేధావులు, ప్రజాసంఘాలు ఒత్తిడి చేయకపోవడంతో భారత ఎన్నికల ప్రక్రియ ప్రపంచ స్థాయిలో నిందల పాలవుతున్నది. దీనికి సాక్ష్యం హుజురాబాద్ ఉప ఎన్నిక. అక్కడ డబ్బు ప్రవాహంపై ఎన్నో సాక్ష్యాలు ఉన్నా ఎన్నికల సంఘం కించిత్తు కూడా స్పందించలేదు. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజకీయ పార్టీలు పోటీ పడి డబ్బు పంచుతూ ఉంటే కళ్లప్పగించి చూసింది. ఇవన్నీ ఆగాలంటే ఎన్నికల సంఘం తన విచక్షణాధికారాలు వాడుకోవాలి. తప్పు చేసినట్టు తేలితే కటకటాలలోకి నెట్టాలి. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘానికి తోడు నిలవాలి. ఎన్నికల సంఘాన్ని మరింత బలోపేతం చేసి వారికి సహకరించాలి. నిలువునా అవినీతి, అధికార దుర్వినియోగం తో నిండిపోయిన రాజకీయ వ్యవస్థను శుద్ధి చేయడానికి ప్రభుత్వ యంత్రాంగాలు, ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు, హైకోర్టులు, సిద్ధపడాలి. దీనికోసం కఠిన నియామవళి రూపొందించాలి. పదవులు అనుభవిస్తున్నవారు ఏ హోదాలో ఉన్న ఎన్నికల ప్రచారం చేయకుండా నిషేధించాలి. ఒకవేళ చేసినట్టు తేలితే వెంటనే ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయాలి. వీటన్నింటిని ప్రయోగాత్మకంగా మొదలుపెట్టి దేశమంతా అమలు చేయాలి. దీనికి కావలసింది నిబద్ధత. సామాజిక బాధ్యత, దృఢ సంకల్పం మాత్రమే

# నిఘా నీడలో వైసీపీ ఎమ్మెల్యేలు



విజయవాడ, అక్టోబరు 17, వచ్చే ఎన్నికలలో 175కు 175 స్థానాల్లోనూ విజయం సాధించాలన్న పగటి కలను సాకారం చేసుకోవడానికి జగన్ నేల విడిచి సాము చేస్తున్నారా? పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకుల సహనాన్ని తెగేదాకా లాగుతున్నారా? వంధిమాగధుల ప్రశంసలతో ఆయనకు దేవతా వస్త్రాలు తొడిగారా? అంటే ఒకదాని తరువాత ఒకటిగా ఆయన పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరు మదింపునకు చేస్తున్న ప్రయత్నాలు, తీసుకుంటున్న చర్యలు చూస్తుంటే ఔనన‌క తప్పదంటున్నారు పరిశీలకులు. ఇప్పటికే పలు మార్లు ఆయన పార్టీ నేతల పనితీరుకు కొలమానం గడపగడపకు కార్యక్రమంలో వారి పనితీరేనని చెప్పారు. వారి పని తీరును బట్టే వచ్చే ఎన్నికలలో పార్టీ టికెట్ ఉంటుందా.. ఊడుతుందా అన్నది నిర్ణయిస్తాననీ చెప్పారు. ఈ విషయంలో సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేదనీ అందరినీ ఒకే గాటన కట్టేశాననీ చెప్పారు. ఇప్పుడు ఇక ఆయన మరో అడుగు ముందుకు వేసి పార్టీ ఎమ్మెల్యేలపై నిఘా పెట్టారు. పెంచారు. ఇప్పటికే పలు మార్లు హెచ్చరించినా ఎమ్మెల్యేలు, మంత్రులు పని తీరు మార్చుకోవడం లేదని ఆగ్రహంగా ఉన్న జగన్ ఇప్పుడు వారిపై నిఘా నేత్రాలను సారించారు. పీకే బృందం ఒకవైపు, ఇంటిలిజెన్స్ మరో వైపు ఎమ్మెల్యేలను అడుగడుగునా పరిశీలిస్తున్నారు. గడపగడపలో వారి పెర్ఫార్మెన్స్ పై ఎప్పటికప్పుడు జగన్ కు నవేదికలు ఇస్తున్నారు. ఇప్పటికే అది జరుగుతున్నా.. విశాఖ గర్జన వైఫల్యంతో ఈ నిఘాను మరింత పెంచారు. వచ్చే ఎన్నికలలో ఎవరికి పార్టీ టికెట్ ఇవ్వాలి, ఎవరికి మంగళం పాడాలి అన్న విషయంపై ఈ నిఘా నివేదికలనే ఆయన నమ్ముకున్నారు. ప్రతి ఎమ్మెల్యే వెంటా ఒక ఐప్యాక్ ప్రతినిథిని పంపడానికి జగన్ నిర్ణయించుకున్నారు. ఇక ఇంటెలిజెన్స్ నిఘా ఎలాగూ ఉంటుంది. ఇక ఇప్పుడు ఎమ్మెల్యేలు, మంత్రుల వెంట తిరిగే ఐ ప్యాక్ ప్రతినిథి అనుక్షణం వారి పనితీరును పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు జగన్ కు పంపుతారు. ఆ నివేదికలే సదరు ఎమ్మెల్యే, మంత్రి పని తీరుపై జగన్ ఒక అంచనాకు, తద్వారా ఒక నిర్ణయానికి రావడానికి దోహదపడుతాయి. ఐప్యాక్ ప్రతినిథులు రోజువారీ నివేదికలు, ప్రజలలో ఎమ్మెల్యేకు ఉన్న ఆదరణ, ప్రజల వద్దకు వెళుతున్నారా? ఆయన ప్రసంగాలలో ప్రభుత్వ పథకాల గురించి సమగ్రంగా వివరిస్తున్నారా? సంక్షేమ పథకాల లబ్ధిని చెబుతున్నారా? గ్రామ, వార్డు సచివాలయాలను సందర్శిస్తున్నారా..ఇలా ఎమ్మెల్యే తన ఇంటి గడప దాటి గడప గడపకు వెళుతున్నారా లేదా నుంచి.. ప్రతి మాటకూ ముందూ వెనుకా జగన్ సంక్షేమ పథకాలను పొగుడుతున్నారా లేదా అన్న అంశాలపై ఉంటాయి. ఈ నివేదికలను ఏ రోజుకారోజు వైసీపీ కార్యాలయం విశ్లేషించి వారానికి ఒక సారి ఒక సమగ్ర నివేదికను జగన్ కు అందజేస్తుంది. ఇలా రాష్ట్రంలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్న 151 నియోజకవర్గాల నుంచీ కూడా జగన్ కు నివేదికలు అందుతాయి. వాటి ఆధారంగా జగన్ ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేస్తారు. ఇప్పటికే జగన్ గడప గడపకు వర్క్ షాప్ లో కొందరు ఎమ్మెల్యేల పేర్లు చెప్పి మరీ వారి పని తీరు బాగాలేదనీ, మార్చుకోకుంటే చర్యలు తప్పవనీ ముఖం మీదే చెప్పేసిన సంగతి తెలిసిందే. అలా జగన్ తన అసంతృప్తిని వ్యక్తం చేసిన వారిలో మంత్రులు బొత్స సత్యనారాయణ, రోజా వంటి వారు కూడా ఉన్నారు. ఆ వర్క్ షాపులో పేర్లు చెప్పని వారి పని తీరు బాగుందని కాదని కూడా ఆ సందర్భంలో జగన్ విస్పష్టంగా చెప్పారు. ఇలా ప్రతి క్షణం, ప్రతి రోజూ నిఘా నీడలో పని చేయాల్సి రావడం చాలా ఇబ్బంది అని వైసీపీ ఎమ్మెల్యేలు తమ సన్నిహితుల దగ్గర వాపోతున్నారు. ప్రతి క్షణం శీల పరీక్షకు నిలబడి పని చేయడం తమ వల్ల కాదని ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు అంతర్గత సంభాషణల్లో చెబుతున్నారు. పార్టీ టికెట్ రాకపోతే పోయింది. ప్రతి రోజూ, ప్రతి క్షణం స్కానింగ్ కు నిలబడటం మా వల్ల కాదని కొందరు కాడి వదిలేయడాని కూడా సిద్ధపడుతున్నారని పార్టీ వర్గాలే అంటున్నాయి. జగన్ చాలా దూరం వచ్చేశారనీ, పిల్లినైనా గదిలో తలుపులు మూసి బంధించి బెదరిస్తే తిరగబడుతుందనీ, ప్రజా ప్రతినిథుల మీద జగన్ నిఘా బూమరాంగ్ అయి మొదటికే మోసం వచ్చే పరిస్థితి తప్పదనీ రాజకీయవర్గాలు అంటున్నాయి. ఏది ఏమైనా ప్రజా ప్రతినిథుల పని తీరును చెప్పాల్సింది ప్రజలే కానీ.. నిఘా బృందాలు కాదనీ, ఇప్పుడు జగన్ ఎమ్మెల్యేల సహనాన్ని పరీక్షిస్తున్నారనీ, తెగేదాకా లాగుతున్నారనీ పరిశీలకులే కాదు, పార్టీలోని కొందరు కూడా బాహాటంగానే చెబుతున్నారు.

# నేతలు...రాజకీయ రచ్చలు

విజయవాడ, అక్టోబరు 17,ఆంధ్రప్రదేశ్ లో రాజకీయాలు వీధిన పడ్డాయి. ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉండగానే రాజకీయ రచ్చ మొదలయింది. ఎవరి జెండా వారిది. ఎవరి అజెండా వారిది. అంతవరకూ పరిమితమయితే ఓకే. కాని వ్యక్తిగత విమర్శలు చేయడంతోనే ఈ రభస మొదలవుతుంది. ముఖ్యంగా నిన్న విశాఖలో జరిగిన గర్జనలో మంత్రులు, మాజీ మంత్రులు కొందరు మాట్లాడిన తీరు అభ్యంతరకరమే. పవన్ కల్యాణ్ మూడు పెళ్లిళ్ల విషయం, చంద్రబాబు, లోకేష్ పై మాజీ మంత్రులు వ్యక్తిగత విమర్శలకు దిగారు. దీంతో విశాఖ వేదికగా రాజకీయం మరోసారి రగడ అయింది. ఎవరి నినాదం వారు చేసుకోవచ్చు. ఒకరు మూడు రాజధానులంటే మరొకరు ఏకైక రాజధానిగా చెప్పుకోవచ్చు. రేపు ఎన్నికలలో ప్రజలు అంతిమంగా తీర్పు చెబుతారు. ఏ ప్రాంతం ఆ ప్రాంతంలోనే తమ డిమాండ్ ను ఓటు రూపంలో తెలియజేస్తారు. తర్వాత వచ్చే ప్రభుత్వం దానిని అమలు చేయవచ్చు. లేకుంటే లేకపోవచ్చు. కానీ విశాఖ పరిపాలన రాజధాని కావాలంటూ జేఏసీ గర్జన చేపట్టిన రోజునే ఇతర పార్టీలు కూడా సమావేశాలు పెట్టాయి. జనసేన తాము మూడు నెలలకు ముందే జనవాణి కార్యక్రమాన్ని ఖరారు చేశామని ఇప్పుడు చెబుతుంది. టీడీపీ విశాఖ అభివృద్ధిపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది... ఇలా ఒకరినొకరు రెచ్చగొట్టే విధంగా రాజకీయ పార్టీలు వ్యవహరించడంతో క్యాడర్ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. విశాఖ విమానాశ్రయంలో మంత్రులపై దాడి జరిగిందని చెబుతున్నారు. జరగలేదని జనసేన చెబుతుంది. దీంతో అనేక మంది జనసేన నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. వీరి భవిష్యత్ ఏంటి? పోలీసు కేసుల్లో ఇరుక్కున్న నేతలకు, కార్యకర్తల కుటుంబాలకు ఈ రాజకీయ పార్టీలు ఏం సమాధానాలు చెబుతాయి? అన్న ప్రశ్న తలెత్తుతోంది. న్యాయవాదులను పెట్టి బెయిల్ తీసుకుని బయటకు రావచ్చు. కానీ ఆ యువకులు భవిష్యత్ గురించి రాజకీయ పార్టీలు ఆలోచించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రాజకీయ పార్టీల నిర్వాకం వల్ల ఇబ్బంది పడేది సామాన్య ప్రజానికమే. నిన్న విమానాశ్రయం నుంచి వెళ్లేవారు దాదాపు 30 మంది ఫ్లైట్ మిస్ అయ్యారు. విమానం దిగిన వారు ఇంటికి వెళ్లడానికి కొన్ని గంటల సమయం పట్టింది. మరోవైపు పవన్ వంటి చరిష్మా కలిగిన నేత విశాఖకు వస్తుంటే పోలీసులు సరైన భద్రత కల్పించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ర్యాలీలతో ప్రజలను ఇబ్బంది పెట్టడం కూడా రాజకీయ పార్టీలకు సరికాదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. మూడు రాజధానులు కాదు.. మూడు పార్టీలదీ మొండితనమే. ఎవరికీ ఎవరు తగ్గరు. ఫలితం వచ్చే ఎన్నికల వరకూ ఏపీలో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయి. పార్టీ అభిమానులు అరెస్ట్ అవుతూనే ఉంటారు. ఈ సంస్కృతి ఇక కొనసాగుతూనే ఉంటుంది.

# కొడాలి అడ్డాలో బీఆర్ఎస్ పోస్టర్లు

విజయవాడ, అక్టోబరు 17, తెలంగాణ సీఎం కేసీఆర్ టీఆర్ఎస్ ను జాతీయ పార్టీ బీఆర్ఎస్ గా ప్రకటించిన వెంటనే విజయవాడలో.. తర్వాత కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో.. తాజాగా ఇప్పుడు కొడాలి నాని అడ్డా గుడివాడ పట్టణం నడిబొడ్డున బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు వెలిశాయి. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణను అడ్డగోలుగా విడగొట్టుకున్న కేసీఆర్ అంటే.. టీఆర్ఎస్ పార్టీ నేతలంటే ప్రతి ఆంధ్రుడిలోనూ ఇప్పటికింకా ఆగ్రహం తగ్గని పరిస్థితి ఉంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా ప్రతి ఒక్కరూ ఆంధ్రులను ఇష్టం వచ్చినట్లు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేసిన వైనం ప్రతి ఆంధ్రుడూ గాయం మీద కారం పూసిన చందంగానే ఫీలవుతున్నారు. అయినప్పటికీ ఇలా ఆంధ్రప్రదేశ్ లో కేసీఆర్ పార్టీ ఫ్లెక్సీలు వరుసగా వెలుస్తుండడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ప్రజలలో విస్మయం వ్యక్తమౌతోందికేసీఆర్ జాతీయ పార్టీ బీఆర్ఎస్ పార్టీకి శుభాకాంక్షలు తెలుపుతూ విజయవాడలోని వారధి ప్రాంతంలో హోర్డింగ్ ఏర్పాటైనప్పుడు కలకలం రేగింది. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండి రమేష్ పేరిట ఈ భారీ హోర్డింగ్ కనిపించింది. 'జయహో కేసీఆర్.. నిరంతర పోరాట యోధుడు.. అనితర సాధ్యుడు.. నవ తెలంగాణ నిర్మాత.. కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు జాతీయ పార్టీ ప్రకటిస్తున్న సందర్భంగా వారికి ఇవే మా.. శుభాకాంక్షలు' అంటూ బండి రమేష్ పేరిట ఈ భారీ ఫ్లెక్సీ దర్శనం ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మరి కొద్ది రోజులకు బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున మరో ఫ్లెక్సీ వెలిసి కలకలం రేపింది. కేసీఆర్ జాతీయ పార్టీని ప్రకటించిన రెండు రోజుల్లోనే బీఆర్ఎస్ ఫ్లెక్సీలు అమలాపురంలో కనిపించడం చర్చనీయాంశంగా మారింది. 'జై బోలో.. జై కేసీఆర్.. బీఆర్ఎస్ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి రేవు బాలాజీరావు' అంటూ బీఆర్ఎస్ ఫ్లెక్సీలు వెలిశాయి. కైకలూరు నియోజకవర్గంలో కూడా బీఆర్ఎస్ పార్టీని స్వాగతిస్తూ పలుచోట్ల ఫ్లెక్లీలు ఏర్పాటయ్యాయి. అల్లూరుకి చెందిన రెడ్డి సతీశ్ అరోరా పేరుతో గుడివాడ, సింగరాయపాలెం, అల్లురు సెంటర్, కోరుకొల్లు, కొత్తపాల్గొని రోడ్డు, కొండేటి రోడ్డు, భీమవరం, రోడ్డువాక ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఛీఫ్ కేసీఆర్, మంత్రి కేటీఆర్, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఫొటోలతో భారీ ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. ఇప్పుడు కొడాలి నాని అడ్డాలో కూడా బీఆర్ఎస్ ఫ్లెక్సీ ఏర్పాటవడం కలకలం రేపుతోంది. 'టీఆర్ఎస్ టూ బీఆర్ఎస్.. శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ గారికి ఇవే మా శుభాకాంక్షలు' అంటూ కేటీఆర్ యూత్ పేరిట రవి స్వీట్స్ అండ్ బేకరి.. గుడివాడ పేరుతో ఈ ఫ్లెక్సీ వెలిసింది. ఏపీ ప్రజలంటే పచ్చి మిరపకాయ కొరికిన చందంగా కారాలు మిరియాలు నూరిన కేసీఆర్ అండ్ కోను ఆహ్వానిస్తూ.. శుభాకాంక్షలు చెబుతూ ఏపీలోని నలు దిశలా ఫ్లెక్సీలు ఏర్పాటు అవడం వెనుక అధికార వైసీపీ నేతల హస్తం ఉండి ఉండొచ్చనే ఊహాగానాలు సర్వత్రా వస్తున్నాయి. కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన సందర్భంగా.. మంత్రి బొత్స మాట్లాడుతూ.. ఏపీలో ఉన్న అనేక పార్టీలతో పాటు బీఆర్ఎస్ కేవలం మరో పార్టీ అవుతుందని అనడం గమనార్హం. బీఆర్ఎస్ వల్ల ఏపీలోని వైసీపీపై ఎలాంటి ప్రభావమూ పడబోదనడం విశేషం. కాగా.. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి బీఆర్ఎస్ పార్టీని ఆహ్వానించడం విశేషం. ప్రజాస్వామ్యంలో కొత్త పార్టీలు రావడం ఆహ్వానించదగ్గ అంశమని అన్నారు. కొత్త కొత్త పార్టీలు వస్తే రాజకీయ పార్టీల పనితీరు మరింత మెరుగవుతుందని ఆయన విశ్లేషించారు. సీనియర్ రాజకీయవేత్త, రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అయితే.. వచ్చే ఎన్నికల్లో ఏపీలో బీఆర్ఎస్ పార్టీకి తాను ఓటు వేయొచ్చని చెప్పడం గమనించదగ్గ అంశం. ఆంధ్రులను అంతలా తిట్టిపోసిన కేసీఆర్ కు ఏపీ సీఎం జగన్ కు సన్నిహిత సంబంధాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని పొలిటికల్ వర్గాల్లో పలు సందర్భాల్లో చర్చ జరుగుతుండడం విశేషం. ఏపీలో ఈ మూడున్నరేళ్లలో తన విధానాలు, పరిపాలనలో అనుభవ రాహిత్యంతో తీసుకున్న అనేక అసందర్భ నిర్ణయాలు, రాష్ట్ర ఆర్థిక స్థితిని అట్టడుగుకు నెట్టేసిన తీరు, సామాన్యుడు భరించలేనంతగా రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసిన వైనంతో ఇప్పటికే వైసీపీ అంటే జనం చీదరించుకునే స్థితి ఉంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో జనం తమకు మరోసారి ఓటు వేసి గెలిపిస్తారనే ఆశలు జగన్ లో రోజు రోజుకూ సన్నగిల్లిపోతున్నాయంటున్నారు. జగన్ స్వయంగా చేయించుకుంటున్న సర్వేలు, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బృందం కూడా వైసీపీలోని ఎక్కువ మంది సిటింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు వ్యతిరేకంగా నివేదికలు ఇస్తోంది. ఇన్ని వ్యతిరేకతల మధ్య తనకు మరోసారి అధికారం అందని ద్రాక్ష అవుతుందేమో అనే ఆందోళన జగన్ లో పెరిగిపోతోందంటున్నారు. ఇలాంటి సమయంలో తన మిత్రుడు, తెలంగాణ సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన వ్యతిరేక ఓటు కొంతైనా చీలుతుందని, తద్వారా తనకు ప్రయోజనం కలుగుతుందనే యోచనలో జగన్ ఉన్నారంటున్నారు.

# 5 నెలల్లో ఏడాది లోటు

విజయవాడ, అక్టోబరు 17, ఇంకా కొన్ని శాఖల్లో ఉద్యోగులకు జీతాలు, రిటైరైన వారికి పెన్షన్లు రాలేదని ఉద్యోగ సంఘాల నేతలు సీఎస్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై మరోసారి చర్చ ప్రారంభమయింది. ఈ నెలలో రెండు మంగళవారాలు ప్రభుత్వం ఆర్బీఐ వద్ద అప్పు తెచ్చుకుంది. అయినా జీతాలు చెల్లించలేకపోయారా ?. ఇప్పుడే ఇలా ఉంటే... అప్పుల పరిమితి ముగిసిపోయినందున.. కొత్త అప్పులు దొరకకపోతే.. ఇక ముందు జీతాలు ఎలా చెల్లిస్తారు ? అనే సందేహం చాలా మందిలో ప్రారంభమయింది. ఈ ఆర్థిక సంవత్సంలో ఐదు నెలల కాగ్ ఆడిట్ రిపోర్టులను పరిశీలిస్తే... ఏడాది మొత్తం లోటు ఐదు నెలల్లోనే ఏర్పడింది. మరి మిగతా కాలం ఎలా నెట్టుకొస్తారనేది ఇప్పుడు ఆర్థిక నిపుణులకు సైతం ఊహకందని సస్పెన్స్‌గా మారింది. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా తొలి ఐదు నెలల కాగ్ రిపోర్టులను చూస్తే.. ఆదాయానికి ఖర్చులకు పొంతనే ఉండటం లేదు. ఇప్పటికే నమోదైన లోటు ఆందోళనకరంగా ఉన్నట్లు కనిపిస్తోంది. తొలి ఐదు నెలల్లోనే రూ.44582.58 కోట్లు లోటుగా నమోదు అయింది. ఇది ఆర్థిక సంవత్స రం అంతానికి రూ.లక్ష కోట్లకుపైగా చేరుకునే ప్రమాదం ఉంటుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. గతేడాదికి ఆదాయానికి, వ్యయానికి మధ్య అంతరం రూ.40 వేలకోట్ల వరకు ఉండగా, ఈ ఏడాది ఈ అంతరం ఐదు నెలలకే రూ. యాభై వేల కోట్ల వరకూ చేరింది. తాజాగా తెలిసిన వివరాల మేరకు తొలి ఐదు నెలల్లో రూ.44593కోట్లు సొంత ఆదాయం లభించగా, ఖర్చు ఏకంగా రూ.102490.41 కోట్లుగా ఉన్నట్లు తెలిసింది. ఇంత భారీ లోటు గత కొన్నేళ్లుగా ఎప్పుడూ చూడలేదని అంటున్నారు. ఇంత భారీ లోటు ఉంటే ముందు ముందు భరించడం కష్టమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్టోబరు నుంచి ప్రారంభమైన రెండో అర్ధ సంవత్సరం ఓవర్‌డ్రాఫ్ట్‌తోనే కొనసాగుతున్నట్లుగా తెలుస్తోంది. అక్టోబర్‌లో తొలుత రూ.1900 కోట్లు వరకు ఓడి ఉండగా, తరువాత అది రూ.2,975 కోట్లకు చేరిపోయింది. నాలుగో తేదీన రిజర్వు బ్యాంకు నుంచి సెక్యూరిటీల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న రూ.2 వేలకోట్లు రుణం వెంటనే ఓడి కింద రిజర్వు బ్యాంకు జమచేసుకున్నట్లు చెబుతున్నారు. తరువాత మరికొంత ఓడికి వెళ్లడంతో తాజాగా ఇంకా రూ.1,635 కోట్ల వరకు ఓవర్‌డ్రాఫ్ట్‌లో ఉన్నట్లు తేలింది. ఈ పరిస్థితి లోనే నిధుల లేమితో ఇంకా కొంతమంది ఉద్యోగులకు పూర్తి స్థాయిలో జీతాలు అందలేదని, పింఛనుదారులు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నారని ఉద్యోగ సంఘాల నేతలు చెబుతున్నారు. మరో వైపు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యవహారాలపై నిఘా పెడుతోందన్న ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని.. వివరించాలని కేంద్రం నుంచి రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులకు ఓ లేఖ అందినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలంలో ఆస్తుల కల్పన, వాటి నిర్వహణకు బడ్జెట్‌లో కేటాయించిన నిధుల వివరాలను పంపాలని పేర్కొంది. పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన వివరాలు కూడా కోరింది. 2018-19 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలు చెప్పాలని అడిగినట్లుగా తెలుస్తోంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న కేంద్ర పథకాల నిర్వహణపైనా వివరాలు కోరింది. కేంద్రం అమలు చేస్తున్న పథకాలు, వాటికి కేంద్రం ఇచ్చిన నిధులు, రాష్ట్ర వాటా నిధులు, ఈ పథకాలను నిర్వహిస్తున్న ప్రభుత్వ సంస్థ, నిధులను నిల్వచేసిన సింగిల్ నోడల్ ఏజెన్సీ బ్యాంకు పేరు, సెప్టెంబరు వరకు వచ్చిన నిధుల వివరాలు కూడా చెప్పాలని ఆదేశించినట్లుగా తెలుస్తోంది. ఈ ఏడాది అప్పుల పరిమితి ముగిసిపోయింది. కొన్ని అదనపు అప్పులు కూడా చేశారు. ఇంకా పర్మిషన్ ఉందో లేదో తెలియదు. అయితే అదనపు అప్పుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. బ్యాంకుల నుంచి కూడా తీసుకునేలా చూస్తోంది. అయితే పరిస్థితులు అంత సానుకూలంగా లేవు. ఈ నెలలో ఆర్బీఐ నుంచి అప్పు తెచ్చుకున్నా... ఇంకా జీతాలు ఇస్తూనే ఉన్నారు. ఒక వేల ఆర్బీఐ నుంచి అప్పు రాకపోతే పరిస్థితి ఏమిటన్నది ఉద్యోగులనూ ఆందోళనకు గురి చేస్తున్న ప్రశ్న.

# సాగర తీరంలో నేతల కబ్జాలు...

విశాఖపట్టణం, అక్టోబరు 17,విశాఖ నగరాన్ని ఏపీ పాలనా రాజధానిగా చెయ్యాలంటూ సీఎం జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తుంటే అదే సమయంలో ఆ ప్రాంతంలోని ఇద్దరి ఎంపీల మధ్య మొదలైన ఈగో వార్ వైజాగ్ లో పార్టీని దెబ్బతీస్తుందని భావిస్తున్నాయి పార్టీ శ్రేణులు. రోజురోజుకీ ఇద్దరి మధ్య జరుగుతున్న రియల్ ఎస్టేట్ వార్ ముదురుతూ పోతుందని జరుగుతున్న పరిణామాలు చెబుతున్నాయి . ఇటీవల వరకూ విశాఖ ఏరియా మొత్తాన్ని కనుసైగతో శాసించిన ఒక ఎంపీని ప్రస్తుతం విశాఖకు దూరం పెట్టింది పార్టీ. అంత వరకూ అదే ఏరియాకు చెందిన మరో ఎంపీతో అంతర్గతంగా ఎలాంటి విభేదాలు ఉన్నాయో గానీ అలా దూరమైన ఎంపీపై ఒక్కసారిగా దశాబ్దాల నాటి దసపల్లా భూములను కారు చవుకగా కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివాదం వెనుక ఉంది మరో ఎంపీ అంటూ వార్తలు గుప్పుమన్నాయి. సదరు నేత 30:70 రేషియోలో అంటే భూయజమానులకు 30 శాతం లాభం, డెవెలప్మెంట్ పేరుతో ఏకంగా 70 శాతం లబ్ది తాను, తన బినామీలు పొందేలా ప్లాన్ వేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే ఈ ఆరోపణల వెనుక ఉన్న అసలు వ్యక్తి ఆ రెండో ఎంపీనే అని ప్రస్తుతం విశాఖ ప్రాంతానికి దూరంగా ఉంటున్న నేత వర్గం భావిస్తుంది. దసపల్లా భూముల ఆరోపణలు అలా ఉండగానే, విశాఖ శివార్లలోని ఒక భూ సెటిల్మెంట్ లో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా భూ యజమానికి 1 శాతం, బిల్డర్ కు 99 శాతం అంటూ కుదిరిన ఒక ఒప్పందం వెలుగులోకి వచ్చింది. ఆ బిల్డర్ సదరు రెండో ఎంపీనే అంటూ విమర్శలు వెల్లువెత్తాయి. అయితే రెండు పార్టీలకు లేని అభ్యంతరం తప్పు ఎలా అవుతుందని ఆ రెండో ఎంపీ ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ వ్యవహారంపై వివిధ వర్గాల నుంచి ఆయా రెండో ఎంపీపై ఆరోపణలు తీవ్రం అవుతున్నాయి. వీటి వెనుక ఉంది మొదటి ఎంపీనే అని రెండో ఎంపీ వర్గం భావిస్తోంది. దీంతో ఇద్దరి మధ్య వైరం మరింత ముదిరింది. తమ మధ్య ఇంతటి వైరం ఉన్నా ఆ ఇద్దరు ఎంపీలూ ఒకరిపై ఒకరు డైరెక్ట్ గా ఆరోపణలు చేసుకోరు. అంతా ఇండైరెక్ట్ ఎటాక్ నే. ప్రస్తుతం ఇద్దరి మధ్య విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయంటే కనీసం ఒకరి ముఖం ఒకరు చూసుకోవడం కూడా లేదు. ఒకరు హాజరైన కార్యక్రమానికి మరొకరు హాజరు కావడం లేదు.

# చిరంజీవికి బీజేపీకి సంకేతాలు పంపినట్లేనా ?

హైదరాబాద్, అక్టోబరు 17, రాజకీయాలకు దాను దూరమయ్యాను కానీ రాజకీయాలు తనకు దూరం కాలేదని చిరంజీవి గంభీరమైన డైలాగులు చెప్పారు. కానీ ఇప్పుడు ఆయన కూడా రాజకీయానికి దగ్గరవుతున్నారన్న అభిప్రాయం తరచూ వినిపిస్తోంది. దీనికి కారణం చిరంజీవి చేస్తున్న వ్యాఖ్యలే. తాజాగా ఆయన పూరి జగన్నాథ్‌తో మాట్లాడిన వీడియోలో... రాజకీయాల ప్రస్తావన వచ్చింది. తన నచ్చిన నేతలు లాల్ బహదూర్ శాస్త్రితో పాటు అటర్ బిహారీ వాజ్‌పేయి పర్లను చెప్పారు. లాల్ బహదూర్ శాస్త్రి రెండు తరాల కిందటి నేత. కానీ వాజ్ పేయి మాత్రం ఇప్పుడు యాక్టివ్‌గా రాజకీయాల్లో ఉన్న వారికి బాగా కనెక్ట్ అయిన నేతే. అందుకే శాస్త్రి గారి గురించి చిరంజీవి చెప్పడం కన్నా.. వాజ్‌పేయి గురించి పొగడటమే హైలెట్ అవుతోంది. వాజ్ పేయి ఎందుకు నచ్చారంటే.. హైవేలు బాగున్నాయని..దానికి కారణం ఆయనేనని చిరంజీవి వాదన. చిరంజీవి ఇలా కారణం వెదుక్కుని మరీ బీజేపీని పొగిడారనిపించేలా ఆ వ్యాఖ్యలు ఉ ండటంతో "అన్నయ్య" మళ్లీ రాజకీయానికి దగ్గర అవుతున్నారన్న అభిప్రాయం వినిపించడానికి కారణం అవుతోంది. తాను ఓ పార్టీలో ఉండి.. తన సోదరుడు మరో పార్టీలో ఉంటే.. లీడర్‌గా ఎమర్జ్ కాలేడనే.. తాను రాజకీయాల నుంచి సెలవు తీసుకున్నానని చిరంజీవి చెప్పారు. అంటే రాజకీయాలపై విరక్తితోనే.. అవి తనకు సరిపడవనో ఆయన విరమించుకోలేదు. తన పార్టీ ఫెయిల్యూర్ తర్వాత మరో ప్రయత్నం చేస్తున్న పవన్‌కు సపోర్టుగానే విరమించుకుంటున్నారు. ఇప్పుడు తన సొంత రాజకీయం చేయాలనుకుంటే అందులో ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. ఎందుకంటే చిరంజీవికి ఉన్న స్టామినా కారణంగా అన్ని పార్టీలు రెడ్ కార్పెట్ వేస్తాయి. సూపర్ స్టార్లను తమ పార్టీలో చేర్చుకోవడంలో బీజేపీది అందే వేసిన చేయి. పార్టీలో చేర్చుకోకపోయినా.. తమ సానుభూతిపరులుగా ప్రజెంట్ చేసుకోవడంలో ముందు ఉంటుంది. కేరళలో మోహన్ లాల్ , తమిళనాడులో రజనీకాంత్ బీజేపీలో చేరలేదు. ..కానీ వారు బీజేపీకి సపోర్ట్ అన్న అభిప్రాయాలను కల్పించారు. కుదిరితే ఏపీలో చిరంజీవిని పార్టీలో చేర్చుకోవడం లేకపోతే..సానుభూతిపరుడిగా ప్రొజెక్ట్ చేసుకునే చాన్స్ కోసం బీజేపీ ఎదురు చూస్తోంది. ఇటీవల అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి చిరంజీవికి ప్రత్యేక ఆహ్వానం వచ్చింది. వెళ్లారు కూడా. అక్కడ ప్రధాని మోదీ.. చిరంజీవితో చాలా ఆప్యాయంగా.. దగ్గరి మిత్రుడిలా మాట్లాడారు. అప్పుడే? కొత్త స్పెక్యులేషన్లు ప్రాంభమయ్యాయిచిరంజీవికి ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఐడీ కార్డు జారీ చేసింది. ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేయడానికి ఆయనకు అవకాశం కల్పించారు. ఆయన ఉపయోగించుకుంటారో లేదో స్పష్టత లేదు. కానీ ఆయన మనసు మాత్రం గుర్తించలేనంతగా అయినా బీజేపీ వైపు మొగ్గుతోందని అప్పుడప్పుడూ చిరంజీవి వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలతో వెల్లడవుతోంది. ఈ విషయంలో బీజేపీ నేతలు ఏమైనా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి.. చిరంజీవిని ఆకర్షించడానికి ప్రయత్నిస్తే ముందు ముందు కీలక పరిణామాలు చోటు చేసుకోవచ్చు.ఎందుకంటే బీజేపీతో పొత్తులోనే ... ఆయన సోదరుడు పవన్ కల్యాణ్ ఉన్నారు.

# అమరావతికి అండగా బీజేపీ

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

గన్నవరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సోమవారం ఉదయం హైదరాబాదు నుంచి గన్నవరం విమానాశ్రయం కు చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయం లో కిషన్ రెడ్డికి రాష్ట్ర బిజెపి అధ్యక్షులు సోము వీర్రాజు, బిజెపి నాయకులు ఘన స్వాగతం పలికారు. కేంద్రమంత్రి ఏలూరు, గుంటూరు జిల్లాల్లో పర్యటించనున్నారు.కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రైతులకు సంబంధించి డిజిటల్ ట్రాన్సేషన్ ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేశాం. ఏలూరు లో సర్వీసు సెంటర్ ను ప్రధాని వర్చ్యువల్ గా ఈరోజు ప్రారంభిస్తారు. అమరావతి రాజధాని విషయంలో మా పార్టీ నేతలు ఇప్పటికే చెప్పారు. నాది ప్రత్యేక అభిప్రాయం ఉండదు.. అమరావతి కి బిజెపి కి అండగా ఉంటుంది. రాజకీయాలలో కక్ష సాధింపు చర్యలు సరి కాదు. ఏ రాజకీయ పార్టీ అయినా కార్యక్రమాలు చేసుకోవచ్చు. రైతులు ఆందోళన చేస్తుంటే.. వారికి మోడీ ప్రభుత్వం సౌకర్యాలు కల్పించింది. వారితో చర్చలు చేసి, మోడీ సమస్య తెలుసుకుని చట్టాలు రద్దు చేశారు. ప్రజా స్వామ్యంలో పార్టీ ల కార్యక్రమాలను అడ్డుకోవడం తగదని అన్నారు.

# అడ్రస్ లేని వ్యక్తి పవన్ కళ్యాణ్

గుంతకల్ విశాఖ గర్జన కార్యక్రమం లో పాల్గొన్న మం త్రులపై దాడికి ప్రయ త్నించిన జనసైనికులపై గుంతకల్ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తా రు. అడ్రస్ లేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అంటూ మండిపడ్డారు.చంద్రబాబు నాయుడు దత్తపుత్రుడిగా ఎన్నుకుని ఆయన స్క్రిప్టు రాసి ఇచ్చిన స్క్రిప్ట్ ను చదువుతూ డైరెక్షన్ లో పవన్ నడుచు కుంటున్నారని మండిపడ్డారు.వికేంద్రీ కరణతో నే రాష్ట్ర అభివృద్ధి జరుగు తుందని భావించిన ముఖ్య మంత్రి జగన్ మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముందుకు సాగు తున్నారని చెప్పారు.స్వార్థ ప్రయోజ నాల కోసం 28 గ్రామాల కోసం ఆడుతున్న డ్రామాలు ఆపకపోతే రాష్ట్రంలో ప్రజలు తరిమితరిమి కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు.

# కొవ్వూరులో అమరావతి పాదయాత్ర

కొవ్వూరు అమరావతి రైతులు చేస్తున్నమహాపాదయాత్ర మార్గం మార్పు నేపథ్యంలో సోమవారం యాత్రపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో పాదయాత్ర సాగుతోంది. మహా పాదయాత్రకు తెలుగుదేశం

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు సంఘీభావం తెలిపారు. దేవినేని ఉమా మాట్లాడుతూ అమరావతి రైతుల పాదయాత్రకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తున్నారు. పాదయాత్రకు నిరసన తెలపొచ్చంటూ మీ అధికారులే చెప్తారు. ముఖ్యమంత్రి బయటకు వస్తే మాత్రం షాపులు మూపిస్తారు, పరదాలు కడతారు. ప్రతిపక్షనేతల సభలకు అనుమతులు ఇవ్వరు. బయటకు రాకుండా హౌస్ అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు.

# పత్తిని ముంచుతున్న నకిలీలలు

కర్నూలు, అక్టోబరు 17, నకిలీ విత్తనాలు పత్తి రైతులను ఈ ఏడాదీ ముంచాయి. కర్నూలు జిల్లా ఆస్పరి మండలం యాటకల్లుకు చెందిన రంగన్న ఎనిమిది ఎకరాల్లో, సుదర్శన్ ఏడు ఎకరాల్లో, వడ్డే రాజు, నాగార్జున మూడు ఎకరాల్లో చొప్పున, నగరూరు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి ఐదు ఎకరాల్లో, రాముడు మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఆదోని పట్టణంలో వివిధ రకాల పత్తి విత్తనాలు కొనుగోలు చేశారు. సాగు చేసిన తర్వాత ఆశించిన స్థాయిలో ఎదుగుదల ఉండడంతో దిగుబడులు బాగా వస్తాయని ఆనంద పడ్డారు. పైరు ఎదిగినప్పటికీ కాయలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో దిగుబడులు పూర్తిగా తగ్గాయి. మొదటి కోతలు సాధారణంగా పక్కన ఉన్న పత్తి పొలాల్లో ఎకరాకు ఐదు క్వింటాళ్లువచ్చాయి. వీరి పొలాల్లో ఎకరాకు క్వింటాలులోపే దిగుబడి వచ్చింది.రాష్ట్రంలోని కర్నూలు జిల్లాలో పత్తిని అధికంగా సాగు చేస్తున్నారు. సాధారణ సాగు విస్తీర్ణం 2.50 లక్షల ఎకరాలు. ఈ ఏడాది 2.66 లక్షల ఎకరాల్లో సాగులో ఉంది. గతేడాది అత్యధికంగా క్వింటాలు పత్తి రూ.12,500 వరకూ పలికింది. దీంతో, ఈ ఏడాది పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొన్ని పత్తి విత్తనాల కంపెనీలు కల్తీ విత్తనాలను యథేచ్ఛగా అమ్మి సొమ్ము చేసుకున్నాయి. దిగుబడులు లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఎమ్మిగనూరు మండలంలో 30,191 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. రాధిక కెడిసిఎస్‌హెచ్ రకం వేసిన రైతుల పొలాల్లో కాయలు రాలేదు. దీంతో, 40 మంది రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. నకిలీ విత్తనాల వల్ల మోసపోయామని ఆస్పరి మండలం యాటకల్లుకు చెందిన 30 మంది, నగరూరుకు చెందిన ఎనిమిది మంది రైతులు అధికారులకు ఫిర్యాదు చేసి తమకు తమకు న్యాయం చేయాలని కోరారు.కల్లూరు మండలం గోకులపాడు, పర్ల, కోడుమూరు మండలం కల్లపరి గ్రామాల్లోనూ రైతులు నకిలీ విత్తనాల బారిన పడ్డారు. ఇలా కర్నూలు జిల్లా వ్యాప్తంగా దాదాపు 500 ఎకరాల్లో పత్తి పంట దిగుబడి రాక రైతులు నష్టపోయారు. బాధితుల్లో తులసి అకిరా, నూజివీడు ఆశ, కేసరి రకాల విత్తనాలు వేసిన వారు ఉన్నారు.గతేడాది ఉ మ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లోని 1,889 మంది రైతులు 7,258 ఎకరాల్లో జాదూ విత్తనాలను సాగు చేసి నష్టపోయారు. బాధిత రైతులకు సంబంధిత కంపెనీ నుంచి పరిహారం ఇప్పిస్తామని వ్యవసాయ శాఖాధికారులు ప్రకటించారు. అయితే, పరిహారం ఇవ్వకుండా కోర్టును జాదూ కంపెనీ ఆశ్రయించింది. ప్రస్తుత ఏడాదీ అదే స్థాయిలో రైతులు నష్టపోయి ఉండే అవకాశం ఉంది.గతంలో నకిలీల అనుభవం ఉన్నా నకిలీ, కల్తీ విత్తనాలను అడ్డుకోవడంపై దృష్టి సారించాల్సిన వ్యవసాయ శాఖ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎటువంటి తనిఖీలూ చేపట్టలేదు. జిల్లా పునర్విభజన నేపథ్యంలో తనిఖీలు చేసేందుకు సిబ్బంది కొరత ఉందని సాకుగా చెబుతున్నారు. ఏప్రిల్ నుంచే వ్యవసాయాధికారులు బృందాలుగా ఏర్పడి విత్తన శుద్ధి కేంద్రాల్లో తనిఖీలు చేయాల్సి ఉండగా, ఆ ఊసే లేకుండాపోయింది. మరోవైపు పత్తి రైతులను అధిక వర్షాలు, ఎర్రపురుగు నష్టాలను మిగిల్చాయి. ఈ నెలలో కురిసిన అధిక వర్షాల వల్ల కర్నూలు జిల్లాలో 2,737 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. ఎర్రపురుగు పత్తి పంటను ఆశించడంతో కోడుమూరు మండలం కలపర్రిలో 250 ఎకరాల్లో, గూడూరు మండల వ్యాప్తంగా దాదాపు 400 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది.దిగుబడి పూర్తిగా లేదని చెబుతున్నారు

# ఆ శిఖరం ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామం



పాడేరు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు వంజంగి హిల్స్తో పాటు సముద్ర మట్టానికి సుమారు 4,500 అడుగుల ఎత్తులో ఉన్న బోలెంగమ్మ పర్వత శిఖరం ప్రకృతి ప్రియులకు స్వర్గధామం. ఏడాది వ్యవధిలో సుమారు 2లక్షలకు పైగానే పర్యాటకులు వంజంగి హిల్సు్ను సందర్శించారు.ఇక్కడ సూర్యోదయం, పాల సముద్రం లాంటి మంచు అందాల దృశ్యాలు భూతల స్వరాన్ని తలపిస్తూ ఉంటాయి.అత్యంత ఎత్తులో ఉన్న బోలెంగమ్మ పర్వతంపై ఉదయం సూర్యోదయం దృశ్యాలు అబ్బురపరుస్తాయి.వంజంగి హిల్స్లోని పాల సముద్రం లాంటి మంచు అందాలు అద్భుతం.వంజంగి హిల్స్కు ఎలా వెళ్లాలంటే..విశాఖ నుంచి పాడేరుకు 117 కిలోమీటర్ల దూరం. ప్రయాణ సమయం 3 గంటలు. పాడేరుకు 8 కిలోమీటర్ల దూరంలో వంజంగి కొండలున్నాయి. పాడేరు నుంచి వంజంగి హిల్స్ జంక్షన్ వరకు పక్కా తారురోడ్డు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి వంజంగి హిల్స్గా పేరొందిన బోనంగమ్మ కొండ వరకు సుమారు రెండు కిలోమీటర్ల వరకు మట్టి రోడ్డు ఉంది. జంక్షన్ నుంచి బోనంగమ్మ కొండకు కాలినడకన సమయం గంటన్నర నుంచి రెండు గంటలు.తెల్లవారుజామున 4 గంటల సమయానికే బోనంగమ్మ కొండకు పర్యాటకులు చేరుకోవాలి. రాత్రి బస చేసేందుకు ఎలాంటి కాటేజీలు లేవు. స్థానిక గిరిజనులు టెంట్లను అద్దెకు ఇస్తున్నారు. పాడేరులో లాడ్జీలు అందుబాటులో ఉన్నాయి. వంజంగికి ప్రత్యేకంగా రవాణా సౌకర్యాలు అందుబాటులో లేవు. పర్యాటకులు సొంత వాహనాల్లోనే వస్తుంటారు. పాడేరు పట్టణంలోని కార్లు, ఆటోలు మాత్రం ముందుగా బుక్ చేసుకుంటే అద్దెకు వస్తాయి.తినడానికి పలు రకాల చికెన్ వంటకాలు, అల్పాహారం, నూడుల్స్, నీళ్లు కూడా దొరుకుతాయి.పాడేరు నుంచి 46 కిలోమీటర్ల దూరంలో అరకులోయ, 30 కిలోమీటర్ల దూరంలో జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం, 60 కిలోమీటర్ల దూరంలో లంబసింగి పర్యాటక ప్రాంతాలున్నాయి.దట్టమైన, గంభీరమైన మేఘాల మధ్య నుండి సూర్యుడు ఉదయించడాన్ని మీరు ఎప్పుడైనా చూశారా? ఆంధ్రప్రదేశ్లోని తూర్పు కనుమల్లో పచ్చని విస్తీర్ణంలో కొత్తగా కనుగొనబడిన హిల్ స్టేషన్లలో ఒకటుంది. అదే పాడేరు సమీపంలో ఉన్న వంజంగి హిల్స్.ఈ వంజంగి హిల్స్ ఒక సుందరమైన ప్రదేశం. ఇది ప్రకృతి ప్రేమికులు, హైకర్లు, ట్రెక్కింగ్ ప్రియులు, ఫోటోగ్రాఫర్లకు ఇది స్వర్గధామంగా ప్రసిద్ధి పొందుతుంది. సూర్యకిరణాలు మేఘాల గుంపుల నుండి చొరబడుతున్నాయా అనేలా ఉదయిస్తాయి. ఆకుపచ్చని వంజంగి ఆ కొండలను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటున్నట్టు కనిపిస్తుంది.వంజంగి వంజంగి పర్యాటక ప్రదేశాలకు కొరత లేదు. ఇంకా పూర్తిస్థాయిలో గుర్తించబడని ఈ సరికొత్త పర్యాటక ప్రదేశానికి వెళ్లేందుకు టూర్ ప్లాన్ చేసుకోవాల్సిందే. ప్రకృతి అద్భుతాలతో అనుబంధాన్ని అనుభవించడానికి ఈ హిల్స్టేషన్ చిరునామాగా నిలుస్తుంది. వంజంగి కొండలపై మేఘాలు కమ్ముకున్నప్పుడు, పొగమంచు నది ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నట్లు అనిపిస్తుంది. ట్రెక్కర్లు మేఘాల పైన నడుస్తూ.. తేలుతున్న అనుభూతిని పొందుతారు. పట్టణ జీవితంతో అలసిన వారికి కాస్త మానసిక ఉల్లాసాన్ని అందించేందుకు వంజంగి టూర్ ప్లాన్ సరైన ఎంపిక.ఇక్కడ నుండి పర్యాటక ప్రేమికులు తెల్లవారుజామున దట్టమైన, పచ్చని అడవుల గుండా 5 కిలోమీటర్లు నడక మార్గంలో ప్రయాణించడం ద్వారా అద్భుతమైన సూర్యోదయ దృశ్యాలను ఆస్వాదించడానికి అవకాశం దొరుకుతుంది. కొండపైకి చేరుకోగానే మేఘాల మీద నిలబడిన అనుభూతి కలుగుతుంది.ఇక మీరు ఇలాంటి అనుభూతిని పొందాలనుకుంటే వంజంగి వెళ్లాల్సిందే ....

# ఉచిత బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం

## సర్కార్ తీరుపై బిజెపి నేతల ఆందోళన

విజయవాడ,అక్టోబరు17(): కరోనాతో ఉపాధి కోల్పోయిన పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న ఉద్దేశ్యంతో కేంద్రం తెచ్చిన ఉచిత బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం రానురాను మంగళం పాడుతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఆహార భద్రత చట్టం కింద ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం పీఎంజీకేఏవై పేరుతో కేంద్రం ఇప్పటి వరకూ ఆరు విడతలుగా ఉచిత బియ్యాన్ని పేదలకు మంజూరు చేసింది. మొదట్లో 2021లో ఆరు నెలలు ప్రకటించగా, తర్వాత రెండున్నరేళ్లుగా ఈ పథకాన్ని పొడిగిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా తాజాగా అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ మరో మూడు నెలలు పొడిగిం చింది. రెగ్యులర్ పీడీఎస్ మినహా ఉచిత బియ్యం పంపిణీ ఊసే ఎత్తడం లేదు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే కానీ ఏమీ చెప్పలేమని, అసలు వస్తాయో రావో కూడా చెప్పలేమని రెవెన్యూ, పౌరసరఫ రాల శాఖాధికారులు చెబుతున్నారు. కరోనా ప్రభావంతో ఉపాధి కోల్పోయిన పేదలను ఆదుకునే క్రమంలో ప్రతినెలా రెగ్యులర్ కోటాతో పాటు కేంద్రం అదనంగా పీఎంజీకేఏవై కింద కార్డులోని ప్రతి సభ్యుడికీ అయిదు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తోంది. రెగ్యులర్ పీడీఎస్ బియ్యాన్ని ఎండీయూ ఆపరేటర్లు ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండగా, ఉచిత బియ్యాన్ని రేషన్‌డీలర్లు చౌకదుకాణంలో పంపిణీ చేస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్టం కార్డుదారులకు మాత్రమే ఉచిత బియ్యం పంపిణీ చేస్తుండగా, మిగిలిన వాటికి రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి వస్తోంది. ఇందులో రెగ్యులర్ కోటాతో పాటు కేంద్రం ప్రకటించిన ఉచిత కోటాలో మిగిలిన కార్డులకు పంపిణీ చేయడం రాష్ట్రంపై అదనపు భారం పడుతోంది. దీనిని భరించలేని రాష్ట్ర సర్కారు అసలుకే ఎసరు తెచ్చే ప్రయత్నం చేస్తోందనే విమర్శలున్నాయి. కేంద్రం పరిధిలోని కోటా కార్డులకు పోను మిగిలిన కార్డుదారులకు బియ్యం ఇవ్వకుంటే, ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందని భావించిన ప్రభుత్వం ఉచితం నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆరో విడతలో భాగంగా కేంద్రం 2022 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ పొడిగించగా వాటిని రాష్ట్రం ఆపేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. కేంద్రం తెచ్చిన ఉచిత బియ్యం పథకానికి రాష్ట్రం తూట్లు పొడుస్తూ పేదలకు అన్యాయం చేస్తోందని వాపోయారు. ఇందులో భాగంగా మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఆందోళనలు చేపట్టి తహసీల్దార్ల నుంచి కలెక్టర్ వరకూ వినతిపత్రాలు అందజేశారు. మరోవైపు రాష్ట్ర బీజేపీ నాయకులు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. దీంతో కేంద్ర మంత్రి కూడా తీవ్రంగా స్పందించారు. ఉచిత బియ్యాన్ని కొనసాగించకుంటే మిగిలిన పథకాలు ఆపేస్తామని హెచ్చరించారు. దీంతో దిగి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు, సెప్టెంబరు నెలలకు ఉచిత కోటాను కొనసాగించింది. అప్పటికే జరిగిపోయిన ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు బియ్యం మాట ఊసే ఎత్తలేదు. ఇదిలా ఉండగా ఈ పథకాన్ని కేంద్రం ఇటీవల మరో మూడు నెలలు పొడిగించింది. కేంద్ర ప్రకటన ప్రకారం అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఉచిత బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకూ ఆ జాడే లేదు. ఈ మూడు నెలల పంపిణీపై కూడా నీలినీడలు కమ్ముకోవడంతో అటు కార్డుదారులు, ఇటు రేషన్‌డీలర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే నాలుగు నెలల కోటా బియ్యం ఇవ్వకపోగా మరో మూడు నెలలు కూడా అదే పరిస్థితి ఉంటుందేమోనన్న అనుమానం వ్యక్తమవుతోంది. కేంద్రం ప్రకటనతో దిగొచ్చి పంపిణీ చేసిన ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కేంద్రం తన వాటా కార్డులకు 65 శాతం బియ్యం కేటాయిస్తే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను దృష్టిలో పెట్టుకుని మరో 30 శాతం రాష్ట్రం కేటాయింపులు చేసింది. దీంతో పేదలు అందరికీ ఉచిత బియ్యం అందగా, రేషన్ డీలర్లకూ కమిషన్ రూపంలో ఆదాయం వచ్చింది.

# ఆరుగురు దొంగలు అరెస్టు

గుంటూరు గుంటూరు జిల్లాలో పట్టపగలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను గుంటూరు నల్లపాడు పోలీసులు అరెస్టు చేసారు. కేసు వివరాలను గుంటూరు జిల్లా ఎస్పీ అరిఫ్ హాఫీజ్ వెల్లడించారు. వెస్ట్ బెంగాల్ కు చెందిన నిందితులు పగలు రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతున్నారు. చెత్త కాగితాల ఏరుకుంటు దొంగతనాలకు పాల్పడి అనంతరం ట్రైన్ లో వెళ్ళిపోతారు. గతంలో వీరిపై వెస్ట్ బెంగాల్ లోనే కాకుండా ఆంధ్రప్రదేశ్ లోని పలు పోలీస్ స్టేషన్లో కేసులు ఉన్నాయి. వీటికోసం ప్రత్యేక టీమ్ లను ఏర్పాటు చేసి వీరిని వెస్ట్ బెంగాల్ లో అదుపులోకి తీసుకున్నాం. వీరి వద్ద నుంచి 30 లక్షల విలువ చేసే బంగారం,వెండి వస్తువులను స్వాధీనం చేసుకోవడం జరిగింది. గుంటూరు వెంగలయపాలెం మైనర్ బాలిక అత్యాచార ఘటనపై విచారణ చేస్తున్నాం. ఇప్పటికే ఈ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ వెల్లడించారు.

## నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి

ఎమ్మిగనూరుఎమ్మిగనూరు మండలంలోని కె తిమ్మాపురం, దైవందిన్నె గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి, మిరప పంటలను మరియు నకిలీ విత్తనాల వలన నష్టపోయిన పంట పొలాలను సందర్శించి ఆయా రైతులను పరామర్శించారు. . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ... అధికార వైసిపి పార్టీ ముఖ్యమంత్రి తమది రైతు ప్రభుత్వం అని రైతుకు ఏ ఒక్క చిన్న కష్టం వచ్చినా వెంటనే ఆదుకుంటామని కోట్ల రూపాయలతో పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమైనదే తప్ప ఏ ఒక్క రైతును కూడా ఆదుకున్న పాపాన పోలేదని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఒక్క రైతుకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తామని చెప్పారు. ఈరోజు కొన్ని వేల మంది రైతులు నకిలీ విత్తనాల వలన నష్టపోయిన ఈరోజు వారిని కనీసం పాలరించే పాపాన పోలేదని పేర్కొన్నారు. వర్షాలు పడాల్సిన సమయంలో పడక, పడకూడని సమయంలో వర్షాలు పడి పచ్చి కరువు వచ్చి చేతికొచ్చిన పంట సర్వనాశనం అయిన ప్రతి ఒక్క ఎకరాను గుర్తించి నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలని వైసిపి జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

# వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మమేకమైన పేర్నాటి

నెల్లూరు నెల్లూరు నగరంలోని చిల్డ్రన్ పార్కు నందు ఆదివారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి, పట్టబద్రుల ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించవలసిందిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో, వైకాపా రాష్ట్ర ,జిల్లా స్థాయి నాయకుల సహాయ సహకారాలతో తూర్పు రాయలసీమ పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం దొరికిందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయక తన వంతు బాధ్యతగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తానని, అందుకు మీ సహాయ సహకారాలు ఎంత అవసరమని చిల్డ్రన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను అభ్యర్థించారు.

# సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు రాష్ట్ర ముఖ్యంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జిల్లాలోని ముత్తుకూరు మండలం నేలటూరులో ఏపీ జెన్కో మూడో యూనిట్ ప్రారంభించేందుకు త్వరలో రానున్న దృష్ట్యా పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ బి. శ్రీధర్ తో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి ఈనెల 27వ తేదీన జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. తొలుత జిల్లా కలెక్టర్, ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా పోలీసు అధికారి సిహెచ్ విజయ రావు, ఏపీ జెన్కో రాష్ట్ర డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు లతో కలసి శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ మూడో యూనిట్ పరిధిలో సిబ్బంది క్వార్టర్ల సమీపంలో హెలిప్యాడు, బహిరంగ సభ వేదిక స్థలాలను, నిర్మాణంలో ఉన్న పైలాన్ ను పరిశీలించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకల గురించి వారు చర్చించారు. వర్షాలు పడే సూచన ఉన్నందున అందుకు తగినట్టుగా అన్ని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఏపీ జెన్కో పరిపాలన భవనం సందర్శించి అక్కడ ఏర్పాటుచేసిన థర్మల్ పవర్ స్టేషన్ నమూనాను పరిశీలించారు. తదుపరి సెంట్రల్ కంట్రోల్ గదిలోని మూడవ యూనిట్ను వారు పరిశీలించారు. ఈ పర్యటనలో వెంట ఏపీ జెన్కో సి ఇ నాగరాజు, ఎస్.ఈ.లు వెంకటేశ్వరరావు, మధుసూదన్ రావు, జగన్నాథం, చౌదరి నెల్లూరు ఆర్డిఓ మలోల, నుడా వైస్ చైర్మన్ టీ బాపిరెడ్డి, ఏఎస్పీ శ్రీనివాసరావు,ఆర్ అండ్ బి ఎస్ ఈ మాధవి సుకన్య, డీఎస్పీ హరినాథ్ రెడ్డి, తహసిల్దార్ మనోహర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపు దాడి

బద్వేలు మైదుకూరు డీఎస్పీ వంశీధర్ గౌడ్ ఆదేశాల మేరకు బద్వేలు సర్కిల్ పరిధిలో పేకాట స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు...బి.కోడూరు మండలం మేకవారిపల్లె సమీపంలో పేకాట స్థావరంపై దాడిచేసి 5 మంది పేకాటరాయుళ్లను ఉ 34 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు...అట్లూరు సరిహద్దు ప్రాంతంలో 7 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుండి 12 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు...ఈ పేకాట స్థావరాలపై దాడులు చేసిన సబ్ డివిజనల్ ఐడీ పార్టీ సిబ్బంది నాగేంద్ర , భూపాల్ రెడ్డి , శివ , అమరేశ్వరరెడ్డిలను డీఎస్పీ వంశీధర్ గౌడ్ అభినందించారు...

# ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

## 'స్పందన' (గ్రీవెన్స్ డే) లో జిల్లా ఎస్.పి. కే.కే.ఎన్.అన్బురాజన్

కడప జిల్లాలో బాధితులు పోలీసు శాఖ కు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కే.కే.ఎన్.అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కే.కే.ఎన్.అన్బురాజన్ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు

# వై.ఎస్.ఆర్ రైతు భరోసా నల్గొవ ఏడాది రెండవ విడత జమ



కర్నూలు అక్టోబర్ 18:వై.ఎస్.ఆర్ రైతు భరోసా - పి.ఎమ్.కిసాన్ పథకం కింద రైతులకు వరుసగా నాలుగో ఏడాది 2022-23 సం.లో రెండవ విడత రైతు భరోసా లబ్ధిని ప్రభుత్వం జమ చేసిందని, ఇందులో భాగంగా జిల్లాలో 2,78,930 మందికి లబ్ధి రైతు కుటుంబాలకు రూ.119.22 కోట్లు నేరుగా రైతుల ఖాతాలలోకి జమ అయిందని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో వై.ఎస్.ఆర్ రైతు భరోసా-పి.ఎమ్.కిసాన్ పథకం కింద ప్రభుత్వం రైతులకు వరుసగా నాలుగో ఏడాది రెండవ విడత సాయం చేస్తున్న సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డితో పాటు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జేడి వరలక్ష్మి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో వై.ఎస్.ఆర్ రైతు భరోసా - పి.ఎమ్.కిసాన్ పథకం కింద నాలుగో ఏడాది రెండవ విడత సాయాన్ని బటన్ నొక్కి సీఎం వైయస్.జగన్ మోహన్ రెడ్డి రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యాజమాన్యపు హక్కులు ఉన్న రైతులు 2,75,799 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.4,000-00 చొప్పున రూ.115.72 కోట్లు, ఆర్ఓఎఫ్ ఆర్ పట్టాలు ఉన్న 04 మంది రైతులకు ఒక్కొకరికి రూ.4,000-00 చొప్పున రూ.23 వేల ఐదు వందల రూపాయలు, కౌలు రైతు 3,044 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.11,500/- చొప్పున రూ.3 కోట్ల 50 లక్షలు మొత్తం 2,78,930 మంది రైతులకు రూ.119.22 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయానికి సాయంగా అన్ని రకాలుగా అండదండలు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తుందన్నారు. విత్తనం మొదలు పంట అమ్ముకునే వరకు రైతులకు అడుగడుగునా తోడుగా ఉంటుందన్నారు. కావున ఇంకా ఈ క్రాప్ బుకింగ్ చేసుకొని రైతులు ఎవరైనా ఉంటే వెంటనే వారి పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రైతన్నలు వేసిన పంటకు రైతు భరోసా కేంద్రాల నుండి ఈ క్రాప్ బుకింగ్, ఇన్సూరెన్స్ నమోదు చేయటం ద్వారా వేసిన పంటకు రైతు నష్టపోవడం జరగదన్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు పొందాలన్నా కూడా అందుకు సంబంధించి రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ, ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవాలన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యవసాయ అధికారులకు వారి తోడ్పడునిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధి పొందాలని కోరారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనార్టీ, కౌలు రైతులు, ఆర్వోఎఫ్ఆర్(అటవీ), దేవాదాయ భూములు సాగుచేసుకుంటున్న రైతన్నలకు కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద సాయం అందించడం జరుగుతోందన్నారు. వై.ఎస్.ఆర్ రైతు భరోసా - పి.ఎమ్.కిసాన్ పథకం ద్వారా జిల్లాలోని రైతన్నల ఖాతాల్లోకి వరుసగా నాలుగో ఏడాది రెండో విడత ఆర్థిక సాయంగా జమైన నగదు వివరాలు నియోజకవర్గాల వారీగా కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి 37,174 మంది రైతులకు రూ.16.28 కోట్లు ఎమ్మిగనూరు నియోజకవర్గానికి సంబంధించి 38,400 మంది రైతులకు రూ.16.40 కోట్లు మంత్రాలయం నియోజకవర్గానికి సంబందించి 42,003 మందికి రూ.18.02కోట్లు ఆదోని నియోజకవర్గానికి సంబంధించి 18,928 మందికి రూ.8.28 కోట్లు పత్తికొండ నియోజకవర్గానికి సంబందించి 56,319 మందికి రూ.23.48 కోట్లు పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి 21,557 మంది రైతులకు రూ.9.69కోట్లు ఆలూరు నియోజకవర్గానికి సంబందించి 64,466 మంది రైతుల ఖాతాల్లోకి రూ.27.05 కోట్లు, మొత్తం రూ.119.22 కోట్లను ప్రభుత్వం జమ చేసి రైతులకు అండగా నిలిచిందని జాయింట్ కలెక్టర్ వివరించారు.అనంతరం జాయింట్ కలెక్టర్, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రూ.119.22 కోట్ల మెగా చెక్కును రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగేశ్వరరావు, ప్రొబేషనరీ డెప్యూటీ కలెక్టర్ లు ఎన్.మనోజ్ రెడ్డి, జి.వి.రమణ కాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, ఏడిలు, ఏవోలు, రైతులు పాల్గొన్నారు.



# జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం...

## స్పందన కార్యక్రమానికి వచ్చిన మొత్తం 74 ఫిర్యాదులు .

కర్నూలు :జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి. ప్రసాద్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 74 ఫిర్యాదులు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) ఫేస్ బుక్ లో ట్రావెల్ గో ఐడి ని ఉంచి సౌదీ అరేబియాలో సూపర్ వైజర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నా పాస్ పోర్టు , డబ్బులు తీసుకుని సైబర్ నేరగాళ్ళు నన్ను మోసం చేశారని న్యాయం చేయాలని ఎమ్మిగనూరు కు చెందిన సాగర్ ఫిర్యాదు చేశారు. 2) సైబర్ నేరగాళ్ళు మా భార్య బ్యాంకు ఖాతా నుండి అక్రమంగా డబ్బులు డ్రా చేశారని రికవరీ చేయించగలరని కర్నూలు చెందిన పెద్దారెడ్డి ఫిర్యాదు చేశారు.3) రైల్వే డిపార్టు మెంట్ లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని ఒక వ్యక్తి మోసం చేశాడని కర్నూలు కు చెందిన హరి సాయి నాథ్ రెడ్డి ఫిర్యాదు చేశారు .4) ఆదోని, గుంతకల్లులో ఉన్న అప్టస్ వ్యాల్యు హోమ్ ఫైనాన్స్ ప్రవేట్ లిమిటెడ్ వారు తక్కువ వడ్డీ కే హౌస్ రుణాలు ఇస్తున్నామని చెప్పి ఇచ్చిన తర్వాత అధిక వడ్డీలు వసూలు చేస్తూ ఒత్తిడి గురి చేస్తున్నారని, కట్టని వాళ్ళ ఇళ్ళ వద్దకు వచ్చి దుర్భాషలాడుతున్నారని ఇళ్ళను సీజ్ చేస్తామని ఇబ్బందులకు గురి చేస్తున్నారని పత్తికొండ, ఎద్దుల దొడ్డి గ్రామాలకు చెందిన రమేష్ నాయుడు , రంగస్వామి మరియు 20 మంది బాధితులు ఫిర్యాదు చేశారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికిన కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ .



కర్నూలు అక్టోబర్ 17 : (సోమవారం) నంద్యాల జిల్లా పర్యటన నిమిత్తం (ఆళ్ళగడ్డలో వైఎస్సార్ రైతు భరోసా - పిఎం కిసాన్ నాలుగో ఏడాది రెండో విడత నగదు బదిలీ కార్యక్రమం సంధర్భంగా) కర్నూలు (ఓర్వకల్లు) ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి కర్నూలు జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఐపియస్ పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు ముఖ్య మంత్రి కి ఘన స్వాగతం పలికారు.

# చదరంగంతో మేధాశక్తి పెంపు



కర్నూల్ : విద్యార్థులు క్రమం తప్పకుండా చదరంగంలో సాధన చేస్తే మేధాశక్తి పెంపొందుతుందని అవోపా అధ్యక్షులు గోనూరు యుగంధర్ శెట్టి అన్నారు. సోమవారం ప్రకాష్ నగర్ లోని అవోపా సేవ సదన్ నందు అవోపా గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ లో భాగంగా అంతర్ పాఠశాలల చదరంగం పోటీలను ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా అవోపా అధ్యక్షులు గోనూరు యుగంధర్ శెట్టి మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుతూ పతకాలు సాధించాలన్నారు.అవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలని లక్ష్యంతో గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించామని సుమారు 200 మంది పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొని సత్తా చాటడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శేషయ్య, కోశాధికారి నాగరాజు, మహిళా విభాగపు అధ్యక్షురాలు లక్ష్మీ సుజాత, సభ్యులు లక్ష్మీనారాయణ అవినాష్..

# వైజాగ్ టాలీవుడ్ పై మళ్లీ గుసగుసలు..!



బీచ్ సొగసుల విశాఖ నగరంలో ఫిలింఇండస్ట్రీ అభివృద్ధి ప్రతిపాదన ఇప్పటిది కాదు. దశాబ్ధాలుగా దీనిపై రాజకీయ సినీవర్గాల్లో చర్చ సాగుతూనే ఉంది. మూడు రాజధానుల అంశం తెరపైకి రాక ముందు నుంచే అంతకుముందు చంద్రబాబు ప్రభుత్వం హయాంలోనే విశాఖకు సినీపరిశ్రమను తరలించాలని స్టూడియోల నిర్మాణానినికి అనుమతించాలని ప్రతిపాదించారు. కానీ ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధిరాత వేరుగా మారింది. విశాఖలో సినీపరిశ్రమ ఏర్పాటుపై ఆసక్తి ఉన్నా కానీ రాజధాని అంశం తేలకపోవడంతో జగన్ ప్రభుత్వం కన్ఫ్యూజన్ లోనే ఉండిపోయింది.కోర్టుల పరిధిలో వ్యతిరేక ఫలితాలు ఇబ్బందికరంగా మారాయి. ఏది ఏమైనా విశాఖను ఎగ్జిక్యూటివ్ రాజధానిని చేయాలని మూడు రాజధానులు అమలవుతాయని ఇప్పటికీ జగన్ ప్రభుత్వం పట్టుబట్టి ఉంది. రేపటి విశాఖ రాజధాని గర్జన విజయవంతం అయ్యాక సీఎం క్యాంప్ ఆఫీస్ నేరుగా విశాఖకు మారుతుంది. అనంతరం విశాఖలో ఐటీ- పరిశ్రమలు - సినీపరిశ్రమ అనే మూడు కాన్సెప్టులపైనా జగన్ ప్రభుత్వం కీలకంగా దృష్టి సారించనుందని స్థానికంగా నాయకుల్లో చర్చ సాగుతుండడం ఆసక్తికరంగా మారింది.ముఖ్యంగా చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న వైజాగ్ టాలీవుడ్ అంశం ఇకపై ఊపందుకునే ఛాన్సుందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటికే భీమిలి నుంచి విజయనగరం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ వరకూ దాదాపు 15000 ఎకరాలు కేవలం సినీపరిశ్రమకే చెందిన పలువురు బిగ్ షాట్స్ కొనుగోళ్లు సాగించారని స్థానిక నాయకులు వీఆర్వోలు లెక్కలు చెబుతుండడం ఆసక్తిని కలిగిస్తోంది. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ డివైడ్ అనంతర పరిణామమిది. కానీ రాజకీయ సందిగ్ధత అస్థిరతల వల్ల ఇప్పటికీ సినీపరిశ్రమపై ముందడుగు పడలేదని చెబుతున్నారు.అలాగే విశాఖ శివారులోని కొత్త వలస మొదలు అరకు వెళ్లే వరకూ మధ్యలో వేలాది ఎకరాల మెట్ట భూములున్నాయి. ఇవి సినీపరిశ్రమకు అనుకూలం అని కూడా విశ్లేషణలు గతంలో సాగాయి. ఇక భీమిలి పరిసరాల్లో ఇప్పటికే పలు సినీస్టూడియోలు ఉన్నాయి.వైజాగ్ రామానాయుడు స్టూడియో ఇప్పటికే యాక్టివ్ గా ఉంది. అక్కడ అన్ని భాషల సినిమాల షూటింగులు జరుగుతున్నాయి. రామానాయుడు స్టూడియోస్ దగ్గరలోనే నిర్మాత కే.ఎస్.రామారావు సారథ్యంలోని వైజాగ్ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (వీ.ఎఫ్.ఎన్.సీ.సీ) ఇప్పటికే యాక్టివ్ గా ఉంది.అలాగే ఇక్కడ పరిసరాల్లోనే అధికారికంగా ఛాంబర్ - ఎఫ్.ఎన్.సీ.సీ ల కోసం ప్రభుత్వ భూములు కేటాయించారన్న టాక్ కూడా ఉంది. విశాఖ రాజధాని బర్నింగ్ ఇష్యూగా మారడంతో మరోసారి ఇవన్నీ చర్చనీయాంశంగా మారాయి. ఏది ఏమైనా పరిశ్రమలు అభివృద్ధి చెంది యువతరానికి ఉపాధి పెరగాలని ముఖ్యంగా క్రియేటివ్ ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్ కి మణిమకుటంగా మారాలని ప్రజలు కోరుకుంటున్నారు. దీనికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది.

# ఊర్వశీ రౌతేలాని బంతాడేస్తోన్న నెటి జనులు!

బాలీవుడ్ నటి ఊర్వశిరౌతేలా- వికెట్ కీపర్ రిషబ్ మధ్య వివాదం గురించి చెప్పాల్సిన పనిలేదు. ఒకరిపై మరొకరు పరోక్షంగా విమర్శల ట్వీట్ల వర్షం కురిపించుకుంటున్నారు. తెగిపోయిందనుకుంటోన్న బంధాన్ని మధ్య మధ్యలో ఊర్వశి కెలుకుతూ వార్తల్లో నిలుస్తోంది. దీంతో నెటి జనులంతా ఓ అంచనాకి వచ్చేస్తున్నారు. రిషబ్ రిజెక్ట్ చేస్తున్నా..ఊర్వశి పనిగట్టుకుని ఫాలో అవుతుందంటున్నారు.తాజాగా మరోసారి అమ్మడి చర్య ఆ సన్నివేశాన్ని బలపరించింది.



టీ-20 వరల్డ్ కప్ ఆడటానికి ఇండియా ఆసీస్ వెళ్లిన సంగతి తెలిసిందే. అందులో పంత్ కూడా ఉన్నాడు. ఈనేపథ్యంలో ఊర్వశి కూడా ఆస్ట్రేలియా వెళ్లింది. ఫ్లైట్ లో వెళ్తోన్న ఓ పిక్ ని షేర్ చేసి 'నా హృదయాన్ని ఫాలో అవుతున్నా' అని రాసుకొచ్చింది. దీంతో రిషబ్ కోసం ఈ ఆరాటమంతా అంటూ మరోసారి హాట్ టాపిక్ గా మారింది.అతను వద్దంటోన్న దేనికీ ఆరాటం అంటూ నెటి జనులు కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు. ఆసీస్ లో ఉన్న అమ్మడు తాజాగా ఓ షార్ట్ వీడియోని షేర్ చేసింది. అందులో చీర సింధురంతో ధగధగలాడిపోతుంది. ఆ వీడియోని ఉద్దేశించి తొలుత ఇరాన్ లోని మహ్సా అమిని అని ..ఇప్పుడు భారత్ లో నా మీద వేధింపులు జరుగుతున్నాయి. అందరూ నన్ను స్టాకర్ అంటున్నారు.దాని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. నాకు మద్దతుగా నిలువలేదు. వేధింపులు ఆపండి. బలమైన స్త్రీ అంటే గాఢంగా అనుభూతి పొందడమే. ఆమె భయం లేకుండా ప్రేమిస్తుంది. ఆమెకి నవ్వు ఎలా ఉంటుంది. కన్నీళ్లు ఎలా ఉంటాయి? అన్నది బాగా తెలుసు. ఆమె ప్రపంచానికి ఒక బహుమతి అని రాసుకొచ్చింది. దానికి బాధ ఉన్న ఎమోజీని జోడించింది.మరో స్టోరీ లో ఇరాన్ చట్టాల్ని అతిక్రమించిన మహ్సాని అరెస్ట్ చేయాలనుకున్నారు. అంతకు ముందు ఎడ్యుకేట్ చేయడానికి డిటెన్షన్ సెంటర్ కి తీసుకెళ్లారు. అమె అక్కడే చనిపోయింది. పోలీసుల బ్యాట్ తో తలపై మోదడంతోనే అలా జరిగింది. కానీ పోలీసులు హార్ట్ ఫెయిల్యూర్ కారణంగా చనిపోయిందంటున్నారు. దానికి ఆమె తండ్రి సమాధాన్ని జోడించి..మహిళల్ని టార్గెట్ చేయడం ఆపాలంటూ డిమాండ్ పర్వాన్ని చెప్పుకొచ్చింది.అలాగే మీడియా కోసం ఆసిస్ మ్యాప్ ని జోడించింది. ఇది భారతీయ మీడియా కోసం ఆస్ట్రేలియా ఎంత పెద్దతో తెలుసుకోవడం కోసం' అని రాసుకొచ్చింది. మొత్తానికి భారత్ లో తన పరిస్థితిని..ఇరాన్ లో ఆ మహిళ పరిస్థితి అలా ఉందని చెప్పుకొచ్చే ప్రయత్నం చేసింది. దీనిపై ఇండియన్స్ ఒక్కసారిగా భగ్గు మంటున్నారు. అర్ధం పర్ధం లేని పోస్టులు పెడుతూ భారత్ పరువును బజారుకు లాగొద్దంటూ మండిపడుతన్నారు. ప్రచారం కోసం ఇష్టానుసారం భారత్ ని ఉద్దేశించి కామెంట్లు చేస్తే ఇకపై ఊరుకునేది లేదంటూ కొందరు గట్టిగానే హెచ్చరించారు. ముందు మనం ఎంత సక్రమంగా ఉన్నామో తెలుసుకుని కామెంట్లు పెట్టాలంటూ మండిపడుతున్నారు. ప్రచారం కోసం పిచ్చి పిచ్చి పోస్టులు పెడితే? చూస్తూ ఊరుకోం అంటూ గట్టిగానే అందుకుంటున్నారు.

# బాహుబలి హీరోయిన్ అడ్డంగా బుక్ అయ్యింది

బాహుబలి సినిమా తో పాటు పలు హిందీ సినిమాల్లో మరియు సౌత్ సినిమాల్లో ప్రత్యేక పాటల్లో మరియు ముఖ్య పాత్రల్లో నటించిన ముద్దుగుమ్మ నోరా ఫతేహి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.ఇటీవల ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ తనకు హాలీవుడ్ నటుడు బ్రాడ్ పిట్ సోషల్





మీడియా డీపీ అంటే ఇష్టం అంటూ చెప్పుకొచ్చింది. అయితే ఆ తర్వాత తెలిసిన విషయం ఏంటంటే అతడికి సోషల్ మీడియాలో అకౌంట్స్ లేవట.ఇప్పటి వరకు అధికారికంగా సోషల్ మీడియా అకౌంట్ లను ఆయన మెయింటైన్ చేసిందే లేదు. మరి అలాంటప్పుడు ఎలా అతడి డీపీ అంటే ఇష్టం ఏర్పడింది అంటూ చాలా మంది చాలా రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు.ఈ విషయంలో అంతా నోరా ఫతేహి సమాధానం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కొందరు మాత్రం ఆమెకు మద్దతుగా అతడి పేరు మీద ఏమైనా ఫేక్ అకౌంట్ ఉండి ఉంటుంది ఆ ఫేక్ అకౌంట్ లో ఉన్న డిపి ని చూసి ఈమె పొరపాటు పడి ఉంటుంది.అంత మాత్రానికి ఆమెను విమర్శించడానికి ఏమీ లేదని ఆమె ఈ విషయంలో క్లియర్ గా తెలుసుకోకుండా.. లోతుగా ఆలోచించకుండా సమాధానం చెప్పి ఉంటుందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.బాలీవుడ్ తో పాటు అన్ని భాషల్లో సినిమాలు చేస్తూ ఉన్న ఈ అమ్మడిని అవమానించడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు ఆమెను ప్రశ్నిస్తూ ఉంటే మరికొందరు మాత్రం ఎవరి అభిప్రాయం వారిది అన్నట్లుగా ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.మొత్తానికి ఈ బాలీవుడ్ ఐటమ్ సాంగ్ హీరోయిన్ గత రెండు మూడు రోజులుగా సోషల్ మీడియాలో విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ అమ్మడు కాస్త జాగ్రత్తగా ఇకపై అయినా ప్రశ్నలకు సమాధానాలు చెప్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పాక్ బౌలర్‌కు మెంటార్‌గా మారిన షమీ



టి20 ప్రపంచకప్‌లో భాగంగా టీమిండియా ఆస్ట్రేలియాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో శుభారంభం చేసింది. టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ సూపర్ కమ్‌బ్యాక్ ఇచ్చాడు.ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ బౌలింగ్ చేసిన షమీ.. మూడు వికెట్లు.. ఒక రనౌట్‌తో మొత్తంగా ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసి టీమిండియాకు థ్రిల్లింగ్ విజయాన్ని అందించాడు. కాగా టీమిండియా, ఆస్ట్రేలియా మ్యాచ్ ముగిసిన కాసేపటికే అదే స్టేడియంలో పాకిస్తాన్, ఇంగ్లండ్ వార్మప్ మ్యాచ్ ఆడనున్నాయి.ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు మహ్మద్ షమీ.. పాకిస్తాన్ స్టార్ షాహిన్ అఫ్రిదికి కాసేపు బౌలింగ్ మెంటార్‌గా వ్యవహరించాడు. బౌలింగ్‌లో అఫ్రిదికి మెళుకువలు చెబుతూ కనిపించాడు. రైట్ హ్యాండర్ అయిన షమీ.. అఫ్రిది కోసం లెఫ్ట్ హ్యాండ్ బౌలింగ్ చేశాడు. ఈ సందర్భంగా వీరిద్దరు కలిసి ఉన్న ఫోటో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ఏకకాలంలో ఇద్దరు బౌలర్లు ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానుల ఆనందానికి అవదులు లేకుండా పోయాయి.ఇక చిరకాల ప్రత్యర్థులైన టీమిండియా, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌కు మరో వారం మిగిలి ఉంది. అక్టోబర్ 23న(ఆదివారం) ఇరుజట్లు పోటీ పడనున్నాయి. ఇక గాయాల కారణంగా అటు షమీ.. ఇటు అఫ్రిది కొంతకాలం క్రికెట్‌కు దూరమయ్యారు. ఇక టీమిండియా ఫ్రంట్‌లైన్ పేసర్ బుమ్రా గాయపడడంతో షమీ లైన్‌లోకి వచ్చాడు. షమీ టి20 ఆడి దాదాపు ఏడాది కావొస్తున్నప్పటికి ఇవాళ ఆస్ట్రేలియాతో వార్మప్ మ్యాచ్‌లో మాత్రం అద్భుత బౌలింగ్ కనబరిచాడు. అటు అఫ్రిది కూడా చాలా గ్యాప్ తర్వాత మ్యాచ్ ఆడనుండడం.. ఆపై టీమిండియాతో మ్యాచ్ కావడంతో అతనిపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**